కనకదుర్గకు ప్రత్యేక పూజలు

అనకాపల్లి, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు అనకాపల్లి నూకాలమ్మను కలెక్టరు విజయకృష్ణన్, జాయింట్ కలెక్టరు జాహ్నవి దర్శించుకున్నారు. దసరా ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన పంచామృత అభిషేకాల్లో పాల్గొన్నారు. ఈవో సుజాత, తెదేపా నాయకులు దాడి జయవీర్ పాల్గొన్నారు.

★ సతకంపట్టు వద్ద ఉన్న కనకదుర్గ అమ్మవారు గురువారం దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు.



నూకాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టరు

పొంగళ్లు తెచ్చాము అమ్మోరు తల్లీ!



దసరా నవరాత్రుల్లో భాగంగా గురువారం మాకవరపాలెం మీద కాలనీ వేపచెట్టు అమ్మవారి సారె ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. మహిళలు 108 బోనాలు, 56 రకాల పిండి వంటకాలు తలపై పెట్టుకుని గ్రామ వీధుల్లో నడిచి మొక్కులు తీర్చుకున్నారు. కొత్తవీధి వినాయకుని ఆలయం వద్ద అగ్నిగుండం ఏర్పాటు చేశారు. – మాకవరపాలెం, న్యూస్‌టుడే

హౌసింగ్ ఛైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బత్తుల తాతయ్యబాబు గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని సంస్థ కార్యాలయంలో ప్రత్యేక పూజలు, వేదాశీర్వచనాల అనంతరం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు వెల్లువెత్తాయి. గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ఎస్ రాజు, బండారు సత్యనారాయణమూర్తి, పట్టణ మౌలిక సదుపాయాల సంస్థ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, కూటమి నేతలంతా తాతయ్యబాబును అభినందించారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అందరికీ పక్కా ఇళ్ల నిర్మాణాల దిశగా ప్రభుత్వ లక్ష్యాలు సాధించడానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.



విజయవాడలోని సంస్థ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న తాతయ్యబాబు

నిల్వ మాంసం.. మసిబారిన గిన్నెలు

భోజన హోటల్‌లో అధ్వాన పరిస్థితి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని హోటళ్లని తనిఖీ చేసే కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర శ్రీకారం చుట్టారు. పెదబొడ్డేపల్లి పెద్దమదుం సమీపంలోని ఓ హోటల్‌ను గురువారం తనిఖీ చేసినప్పుడు విస్తుపోయే పరిస్థితి ఆయనకు ఎదురైంది. మేక, గొర్రె, కోడిమాంసాలు, రొయ్యలు తాజాగా లేకపోవడం గమనించారు. నిల్వ ఉన్న మాంసాన్ని ఫ్రిజ్‌లో ఉంచినట్టు గుర్తించారు. వంట పాత్రలన్నీ మసిబారిపోయి ఉన్నాయి. చేతులకు గ్లౌజ్‌లు వేసుకోకుండానే సిబ్బంది విధుల్లో ఉన్నట్టు గమనించారు. ఆరుబయట వంటలు చేయడం కనిపించింది. హోటల్ యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబును ఆదేశించారు. ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా చూడాలని నిర్వాహకుడిని ఆదేశించారు. డీఈఈ నారాయణ, ఏఈఈ రవి తదితరులు పాల్గొన్నారు.



ఓ హోటల్ ఆవరణ పరిశీలిస్తున్న కమిషనర్ సురేంద్ర

'గూడు' కట్టుకున్న అక్రమాల గుట్టురట్టు!

ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణాలపై విజిలెన్స్ తనిఖీలు

గుత్తేదారు సంస్థల్లో గుబులు

ఈనాడు, అనకాపల్లి – న్యూస్‌టుడే, అనకాపల్లి

వైకాపా హయాంలో పేదోడి గూడుతో పెద్దోళ్లు లబ్ధి పొందారు. ఇళ్లు కాదు ఊళ్లు నిర్మిస్తామంటూ సెంటు జాగా చొప్పున కొండలు, గెడ్డల పక్కన స్థలాలు ఇచ్చారు. 'అంతదూరం వెళ్లి ఇల్లు ఎలా కట్టుకోగలం?, మాకొద్దు బాబోయ్' అని కొందరు బెంబేలెత్తారు. 'గాబరా పడొద్దు.. మేమే కట్టించి ఇస్తామ'ని అధికారులు మభ్యపెట్టారు. 10,760 మంది లబ్ధిదారుల పేరిట జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఈ పనులు దక్కించుకున్న గుత్తేదారు సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరించాయి. అధికారులు సైతం లబ్ధిదారులకు బిల్లు చెల్లించే స్లాబ్‌లను మార్చి గుత్త సంస్థలకు అనుకూలంగా చెల్లింపులు చేశారు. సిమెంటు, ఇనుము గంపగుత్తగా ఇచ్చారు. ఇక్కడే కొంతమంది చేతివాటం చూపారు. రాక్రీట్ సంస్థ చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను ఇటీవల తనిఖీ చేయగా కొన్ని అక్రమాలు వెలుగుచూశాయి. తాజాగా మిగతా గుత్తేదారు సంస్థలు నిర్మించే ఇళ్లపైనా విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించడంతో ఆయా సంస్థల్లో గుబులు రేగుతోంది.




తుప్పలు, డొంకలతో అడవిని తలపిస్తున్న సెంటు భూమిలో ఇళ్ల నిర్మాణాలు

అనకాపల్లి మండలం సంపతీపురం, రొంగలివానిపాలెం, కూండ్రం, కుంచంగి, మామిడిపాలెం, పాపయ్యసంతపాలెం, పిసినికాడ, సీతానగరం గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో జీవీఎంసీ పరిధిలో లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశారు. ఊరికి రెండు, మూడు కి.మీ దూరంలో స్థలం ఇస్తేనే ఆలోచించేవారు.. ఏకంగా 40 కి.మీ. నుంచి 60 కి.మీ దూరంలో ఇస్తే నిర్మాణాలకు ఎవరైనా ముందుకువస్తారా?.. ఇక్కడ కూడా అదే జరిగింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని సెంటు జాగాలో ఇళ్ల నిర్మాణాలన్నింటినీ ఆప్షన్-3 కింద నాలుగు గుత్తేదారు సంస్థలకు అప్పగించారు. వాటిలో జేఎన్ఆర్, గ్రీన్ కాంక్రీట్ ప్రొడక్ట్స్ సంస్థలు అనకాపల్లి మండల పరిధిలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాయి. ఆనందపురం, సబ్బవరం మండలాల పరిధిలో రాక్రీట్ సంస్థ పనులు చేసింది. తొలుత అనంతపురం జిల్లా రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి చెందిన రాక్రీట్ చేపట్టిన నిర్మాణాలపై విచారణ చేపట్టారు. విజయనగరం జిల్లాలో ఈ సంస్థ చేపట్టిన నిర్మాణాల్లో పెద్దఎత్తున అక్రమాలు వెలుగుచూశాయి. విశాఖ జిల్లాలో పెద్దగా ఉల్లంఘనలు కనిపించలేదని అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు మిగతా గుత్త సంస్థలు నిర్మించే ఇళ్లను తనిఖీలు చేయబోతున్నారు.

సిమెంటు, ఇనుము పక్కదారి..

ఒక్కో లబ్ధిదారునికి 90 బస్తాల సిమెంటు, 400 కేజీల ఇనుము బయట మార్కెట్ కంటే తక్కువ ధరకు ప్రభుత్వం ఇస్తుంది. సొంతంగా నిర్మించుకున్నవారికి వీటిని దశల వారీగా అందజేస్తారు. గుత్తేదారులకు మాత్రం ఒకేసారి ఇచ్చేస్తున్నారు. వాటిని సక్రమంగా గోదాముల్లో భద్రపరిచి ఇళ్ల నిర్మాణాలకు వినియోగించాలి. కొన్ని కాలనీల్లో సిమెంటు, ఇనుము పక్కదారి పట్టించారనే ఆరోపణలున్నాయి. ఎన్నికల ముందు పనులు నిలిచిపోవడంతో అప్పటి వరకు ఉన్న సిమెంటును వైకాపా నేతలకు తరలించినట్లు తెలుస్తోంది. రొంగలివానిపాలెం, కూండ్రం, సంపతీపురం లేఅవుట్లలో సుమారు 25 వేల సిమెంటు బస్తాలు, 60 టన్నుల ఇనుము స్థానిక వైకాపా నేతలు పట్టుకుపోయారని ఇటీవల అనకాపల్లి కలెక్టరేట్‌లో స్థానికులు ఫిర్యాదు చేశారు.



కొన్ని కాలనీల్లో గుత్తేదారు సంస్థలు సిమెంటు ఇటుకల తయారీ యూనిట్లు పెట్టుకున్నాయి. వాటికి ప్రభుత్వం సరఫరా చేసిన సిమెంటు వినియోగించకూడదు. ఆ నిబంధన గాలికి వదిలేసి కొన్ని సంస్థలు ఆ రాయితీ సిమెంటునే ఇటుకల తయారీలో ఉపయోగించారు. సిమెంటు గోదాములను సక్రమంగా నిర్వహించకపోవడంతో వందల కొద్దీ బస్తాలు గడ్డకట్టి వృథాగా పోయాయి. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి ఇచ్చే రూ.1.8 లక్షలు సరిపోకపోవడంతో లబ్ధిదారుల నుంచి అదనంగా రూ.35 వేలు చొప్పున వసూలు చేసి అధికారులు అప్పగించారు. అలా ఇచ్చిన ఇళ్లకు తుది మెరుగులు దిద్దారు.. ఇవ్వని ఇళ్లను అసంపూర్తిగా వదిలేశారు. అనకాపల్లి మండలంలో సొంతంగా ఇళ్లు నిర్మించుకున్న వాటిలో పురోగతి కనిపిస్తోంది తప్ప గుత్తేదారుల నిర్మాణం చేపట్టి 10 వేల ఇళ్లలో ఒక్క ఇల్లు కూడా వందశాతం పూర్తిగా సిద్ధం చేయకపోవడం గమనార్హం.




రొంగలివానిపాలెం కాలనీ గోదాంలో గడ్డకట్టిన సిమెంటు బస్తాలు

చిట్టి తల్లులను కాపాడుకుందాం..

నేడు అంతర్జాతీయ బాలికా దినోత్సవం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే



ఇంటికి వెలుగును నింపే ఆడపిల్లలను కాపాడుకోవడం నేటి సమాజంలో కీలకంగా మారింది. మగపిల్లల సంఖ్యతో పోలిస్తే పుడుతున్న ఆడపిల్లల సంఖ్య తగ్గిపోవడం గమనార్హం. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని పుట్టేది ఎవరో తెలుసుకోవడం సులువవుతోంది. ఆడపిల్ల పుడుతుందని నిర్ధారించుకుంటున్న కొంతమంది తల్లిదండ్రులు గర్భంలోనో, పురిట్లోనో చిదిమేస్తున్న ఉదంతాలు అందరినీ కలిచివేస్తున్నాయి. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ చిట్టితల్లులను పుట్టనీకుండా చేస్తున్నారు. ఆడపిల్లలను కాపాడుకోడానికి ప్రభుత్వం ఎంత ప్రచారం చేస్తున్నా చాలా మందిలో మార్పు రావడం లేదు. అనకాపల్లి జిల్లాలో ఏడాదిలో 1000 మంది మగపిల్లలు పుడుతుండగా 985మంది ఆడపిల్లలే జన్మిస్తున్నారు. ఈ సంఖ్యను పెంచడం, సరిసమానం చేయాలని అధికారులు యత్నిస్తున్నా సాధ్యం కావడం లేదు.



ఇంట్లో ఆడపిల్ల పుట్టి పెరుగుతుంటే ఆ ఇంటికి ఉండే కళే వేరు. అయితే కొంతమంది వరకట్నాలు, ఇతర కారణాలతో అమ్మాయిలను భారంగా భావిస్తూ జన్మనివ్వడానికి ఆసక్తి చూపడం లేదు. బాలికలను మధ్యలో చదువు ఆపేయించి, త్వరగా పెళ్లిళ్లు చేయడం లాంటివి జరుగుతున్నాయి. బాల్య వివాహాలతో అమ్మాయిల ఆరోగ్యం దెబ్బతింటుంది. చిన్నవయస్సులోనే పెళ్లి చేయడం, గర్భం దాల్చడం వల్ల బాలికల ఆరోగ్యం పూర్తిగా క్షీణిస్తుంది. బాల్యవివాహాలతో జరిగే నష్టాన్ని వివరించడంతో పాటుగా ఇలా వివాహాలు చేసేవారికి పడే శిక్షలను వివరిస్తూ అధికారులు ప్రచారం చేస్తున్నారు.


ముమ్మరంగా ప్రచారం: బాలికల జననాల సంఖ్య తగ్గడం. లింగ వివక్ష పెరుగుతుండంతో దీన్ని అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. బాలికల సంరక్షణ, జననాల సంఖ్య పెంచేలా 'బేటీ బచావో.. బేటీ పఢావో' పేరిట ప్రచారం ముమ్మరం చేశారు. చదువు మానేస్తున్న బాలికలను గుర్తించి వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించడం, స్వయం ఉపాధి అందించే చర్యలు తీసుకుంటున్నారు. బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే వెళ్లి పెళ్లి ఆపిస్తున్నారు. చదువు కొనసాగించేలా పెద్దలకు కౌన్సిలింగ్ ఇచ్చి బాలికలను తిరిగి పాఠశాలలు, కళాశాలల్లో చేర్పిస్తున్నారు.

చదివిస్తే ఉన్నతస్థానాలకు..



ప్రతి ఇంట్లో ఆడపిల్ల ఉండాలి. బాలికలను కాపాడుకోవడం అందరి బాధ్యత. పిల్లలకు ఉన్నత చదువులు చెప్పిస్తే వారు కుటుంబానికే కాకుండా ఆ గ్రామానికే పేరు తెస్తారు. ఆడ, మగ అనే లింగ వివక్ష ఉండకూడదు. బాలికల సంరక్షణకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో బాలికల జననాలు పెంచేలా అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నాం.

– అనంతలక్ష్మి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారిణి



లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు



స్కానింగ్‌లో లింగనిర్ధారణ చేసి రిపోర్టు ఇచ్చినట్లు గుర్తిస్తే సంబంధిత డయాగ్నస్టిక్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే అన్ని క్లినిక్‌ల వైద్యులకు దీనిపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. జిల్లాలో ఆడపిల్లల జననాలు పెరిగేలా ముమ్మరంగా ప్రచారం చేపడుతున్నాం. –బాలాజీ, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి



బోర్డులో మారని ఎంపీ, ఎమ్మెల్యే, ఎంపీపీ పేర్లు

పీఠాలు కదిలినా పేర్లు వారివేనా?

సార్వత్రిక ఎన్నికలు జరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా మాకవరపాలెం మండల పరిషత్తు కార్యాలయంలో ఇంకా పాత పేర్లే కొనసాగుతున్నాయి. ఎంపీ, ఎమ్మెల్యే, ఎంపీపీ పేర్లు ఇంకా మార్చకపోవడంపై తెదేపా, జనసేన నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే బోర్డులో పేర్లు మార్చాలని కోరుతున్నారు. – మాకవరపాలెం, న్యూస్‌టుడే

జాతీయ స్థాయి క్రీడలకు వేచలం బాలికలు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు దేవరాపల్లి మండలం వేచలం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు బాలికలు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు డి.నరసింహమూర్తి తెలిపారు. రాజమండ్రిలో ఈనెల 4 నుంచి 8 వరకు జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో ఈ పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. అండర్-16, అండర్ -20 బాలికల విభాగాల్లో బి.చైతన్య, ఆర్.భారతి గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో త్వరలో జరిగే 35వ దక్షిణ భారత స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారు. వీరికి తర్ఫీదునిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు ఆర్.తమ్మునాయుడిని పలువురు అభినందించారు.



ఎంపికైన బాలికలతో వ్యాయామ ఉపాధ్యాయుడు తమ్మునాయుడు

రేషన్ బియ్యం పట్టివేత

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి సమీపంలోని కొత్తపాలెం చెరుకుల ఖాటా వద్ద 850 కిలోల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాలశాఖ, విజిలెన్స్ అధికారులు కలసి పట్టుకున్నారని పట్టణ ఎస్సై సావిత్రి తెలిపారు. బుధవారం జరిపిన తనిఖీల్లో ఈ బియ్యం పట్టుబడిందన్నారు. అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. పాడుబడిన షెడ్డులో ఈ బియ్యాన్ని నిల్వ చేశారన్నారు. నిందితుడు మాకవరపాలెం నివాసి పచ్చిగోళ్ల వెంకట సూర్యనారాయణను అదుపులోకి తీసుకున్నామని ఆమె వివరించారు.

'యాత్రలతో ప్రజాధనం వృథా'

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ప్రజలకు వీధి దీపాల సౌకర్యాన్ని కల్పించలేకపోతున్న జీవీఎంసీ పాలకవర్గం అధ్యయన యాత్రల పేరుతో ప్రజాధనాన్ని వృథా చేస్తోందని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ గురువారం ఓ ప్రకటనలో మండిపడ్డారు.

శివోహం.. పలికింది నారీసమూహం



శివ లింగాలతో దిమిలికి చెందిన మహిళలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: నర్సీపట్నంలో బంక మట్టితో శివ లింగాల తయారీ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో ఆధ్యాత్మిక సంఘం ఆధ్వర్యంలో సమాజాన్ని శివారాధనలో మమేకం చేసే ఉద్దేశంతో దీనిని నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి మహిళలు స్వచ్ఛందంగా వచ్చి ఇందులో పాల్గొంటున్నారు. రాంబిల్లి మండలం దిమిలిలోని శ్రీ లలిత మాతాసంఘం సభ్యులు గురువారం భక్తిశ్రద్ధలతో శివలింగాలను రూపొందించారు. వీటి సంఖ్య లక్షకు చేరుకున్న తరవాత రాజమహేంద్రవరం పంపి అక్కడి నుంచి మొత్తం కోటి లింగాలను కాశీ తదితర క్షేత్రాల్లో పుణ్యనదుల్లో కలుపుతారని నిర్వాహకులు తెలిపారు.

పదివేల దోమతెరల పంపిణీ

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో సీఎస్‌ఆర్ నిధుల కింద వివిధ కంపెనీలు ఉచితంగా 10 వేల దోమతెరలు అందజేయనున్నాయని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి గురువారం గిరిజన సంక్షేమ, మండల అభివృద్ధి అధికారులతో ఆమె దృశ్యమాధ్యమ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీ గ్రామాల్లో 2390, గిరిజన గ్రామాల్లో 4287, ఇతరులకు 1168, వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలకు 1443 చొప్పున దోమతెరలు పంపిణీ చేయనున్నారు. వసతి గృహాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి విద్యార్థి దోమతెరలు వినియోగించుకునేలా సంక్షేమాధికారులు పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, నిల్వనీటి కుంటల్లో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మరో 36 వేల దోమతెరలు పంపిణీకి వివిధ సంస్థల యాజమాన్యాలను కోరినట్లు తెలిపారు. వీటిలో 10 వేలు వసతిగృహాల్లో విద్యను అభ్యసించే విద్యార్థులు, గిరిజన మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఉచితంగా అందజేస్తామన్నారు. గిరిజన సంక్షేమాధికారిణి నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై రవాణా శాఖ కొరడా

విశాఖపట్నం: దసరా పండగ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై రవాణా శాఖ కొరడా ఝుళిపించింది. గురువారం నిర్వహించిన తనిఖీల్లో 8 బస్సులను సీజ్ చేసి, 10 బస్సులపై కేసులు నమోదు చేసినట్లుగా రవాణా శాఖ డీటీసీ జి.ఆదినారాయణ తెలియజేశారు. ప్రయాణికుల నుంచి అధిక ధరలు వసూలు చేయడం, ఎక్కడికక్కడ స్టేజ్ క్యారియర్స్ నిర్వహించడం, పర్మిట్, ఎఫ్‌సీలు లేకుండా తిరుగుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు చేసి, సీజ్ చేసినట్లుగా ఆయన తెలియజేశారు.

స్వచ్ఛతే సేవలో అందరూ పాల్గొనాలి

అనకాపల్లి, న్యూస్‌టుడే: స్థానిక బెల్లం మార్కెట్ యార్డులో గురువారం స్వచ్ఛతే సేవ కార్యక్రమం నిర్వహించారు. యార్డులో పేరుకుపోయిన తుప్పలు, చెత్తను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, సంయుక్త కలెక్టర్ ఎం.జాహ్నవి, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తొలగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటితోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తను రహదారులపై వేయొద్దన్నారు. తడి, పొడి చెత్తగా వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో రూ.15 లక్షలతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. శారదా గట్టును పార్కుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఆర్డీఓ షేక్ ఆయిషా, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి రవికిరణ్, మార్కెట్ కమిటీ కార్యదర్శి శకుంతల, కూటమి నాయకులు డాక్టరు కేకేవీ నారాయణరావు, సకలా గోవింద, బీఎస్ఎంకె జోగినాయుడు, పీలా నాగశ్రీను, ఆళ్ల రామచంద్రరావు, బొద్దేడ శేషు, మోహనరావు పాల్గొన్నారు.



బెల్లం మార్కెట్ యార్డులో తుప్పలు తొలగిస్తున్న కలెక్టరు, జేసీ, ఎమ్మెల్యే తదితరులు

నీటి సంఘాల ఎన్నికలకు నోడల్ అధికారుల నియామకం

అనకాపల్లి, న్యూస్‌టుడే: సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు జిల్లా వారీగా నోడల్ అధికారులు, మాస్టర్ ట్రైనీలను ప్రభుత్వం నియమించింది. జిల్లా నోడల్ అధికారిగా త్రినాథం, ట్రైనీగా వి.చిన్నంనాయుడు, విశాఖ జిల్లా నోడల్ అధికారిగా స్వామినాయుడు, ట్రైనీగా అరవింద్ సురేష్ కుమార్.. అల్లూరి జిల్లా నోడల్ అధికారిగా ఆర్.నాగేశ్వరరావు, ట్రైనీగా డి.లోకేష్‌కుమార్‌లను నియమించారు. ఈ నెల 16వ తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుంది. సాగునీటి సంఘంలో ఆయకట్టు రైతులే సభ్యులుగా ఉంటారు. అందువల్ల సమస్య ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించుకోవచ్చు. సంఘాలకు 2015లో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో ఎన్నికలు నిర్వహించారు. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే ఎన్నికలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో తాండవ, రైవాడ, పెద్దేరు, కోనాం వంటి జలాశయాలు ఉన్నాయి. మొత్తం 303 నీటి సంఘాలు, మూడు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఒక ప్రాజెక్టు కమిటీ ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాలతో వీటికి ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ఓటరు జాబితాలు సిద్ధం చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వం సాగు నీటి వనరులను పట్టించుకోలేదు. సంఘాల ఎన్నికలు నిర్వహించలేదు. కనీసం చిన్న మరమ్మతులు కూడా చేయలేదు. దీంతో ఆయకట్టుదారులకు సకాలంలో నీరందలేదు.

నారింజ.. మిగిలింది బెంగ

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ కోనాం గిరిజన వారపు సంత సీజనల్ పళ్లకు పెట్టింది పేరు. సీజనల్ వారీగా అన్ని రకాల కూరగాయలు, పండ్లు విక్రయిస్తారు. ఈ గురువారం జరిగిన వారపు సంతకు భారీగా నారింజ, దబ్బకాయలు వచ్చాయి. చీడికాడ, పాడేరు, హుకుంపేట, అనంతగిరి మండలాల నుంచి గిరిజన రైతులు తట్టలు, బుట్టలు, సంచులతో సంతకు తీసుకొచ్చారు. ఈ వారం ఎక్కువ మొత్తంలో పండ్లు వచ్చాయి. దీంతో ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. నారింజ ఒక్కొదానికి కేవలం రూపాయి, దబ్బకాయ ఒక్కటి రూ. రెండు చొప్పున మాత్రమే ధర లభించింది. ధరలు తగ్గడంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి వినియోగదారులు, వ్యాపారులు పెద్దఎత్తున కొనుగోలు చేశారు. గిరిజనులు కొండచీపుర్లు, ఆగాకర విక్రయాలు జరిపారు.



సంతలో విక్రయించేందుకు తీసుకొచ్చిన నారింజలు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	137	130
డ్రెస్డ్	199	230
స్కిన్‌లెస్	226	240

స్వీపరు కుమారుడికి కొలువు



విశాఖపట్నం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు కొలువులు సాధించారు. కోరమండల్ ఇంటర్నేషనల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో బుధవారం పది మంది విద్యార్థులు ఎంపికవ్వగా గురువారం జి.బాలాజీ ఎంపికయ్యారు. కళాశాలలో స్వీపరుగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మి కుమారుడు ఈతడు. ఈ సందర్భంగా అతడిని ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ అభినందించారు. కొలువు సాధించిన అనకాపల్లికి చెందిన ఓ విద్యార్థిని తన అంతరంగాన్ని ఇలా పంచుకుంది.



ఆర్థిక ఇబ్బందులు తప్పుతాయి: కోరమండల్ కంపెనీలో ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. తండ్రి కృష్ణ రావు రైతు. తల్లి కుమారి గృహిణి. నాకు అనకాపల్లి కెమికల్ కళాశాలలో సీటు రావడంతో ఇక్కడ చదువుకున్నా. కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు దూరమవుతాయి. నాకు ఉద్యోగం రావడం తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణం. నాన్న ఎంతో కష్టపడి చదివించారు. ఉద్యోగం రావడంతో వారికి ఆసరాగా ఉంటాను.

-ఎ.మోనిక ప్రియ, పెట్రోకెమికల్ బ్రాంచ్, అనకాపల్లి

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా : **దేవర,** రామచంద్ర: **వేట్టయన్ ద హంటర్,** శ్రీ సత్య: **మత్తు వదలరా 2,** సత్యనారాయణ స్క్రీన్1: **రామ్‌నగర్ బన్నీ,** స్క్రీన్2: **మత్తు వదలరా** వెంకటేశ్వర: **దక్షిణ,** పర్తిసాయి: **వేట్టయన్ ద హంటర్,** షిర్డిసాయి: **వేట్టయన్ ద హంటర్** **అచ్యుతాపురం:** శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: **వెట్టైయాన్,** స్క్రీన్-2: **దేవర పార్ట్-I**

హోంగార్డు కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన పి. రవికుమార్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఎస్పీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డుల ఒక రోజు వేతనం రూ. 4,10,695 నగదు చెక్కును ఎస్పీ ఎంపీ దీపిక చేతుల మీదుగా అందజేశారు.

రాయితీపై టమాటా, ఉల్లి విక్రయాలు

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి మార్కెట్ యార్డు ఆవరణలో గురువారం రాయితీపై ఉల్లి, టమాటాలు విక్రయించారు. ఏదైనా రూ. 50గా ధర నిర్ణయించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. వీటి కొనుగోలుకు ప్రజలు బారులు తీరారు. మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి రవికిరణ్, మార్కెట్ కమిటీ కార్యదర్శి శకుంతల, శ్రీగౌరీ హోల్ సేల్ కాయగూరల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మళ్ల జగ్గఅప్పారావు, కాండ్రేగుల బుజ్జి పాల్గొన్నారు.



ఉల్లిపాయలు అందిస్తున్న కొణతాల

దూరం తెలిసేదెలా?

నక్కపల్లి, న్యూస్‌టుడే: నర్సీపట్నం - అడ్డురోడ్డు మధ్య రోజూ వందల మంది ప్రయాణిస్తుంటారు. ఈ మార్గంలో చాలాచోట్ల మైలురాళ్ల చుట్టూ తుప్పలు పెరిగిపోయాయి. దీంతో రాకపోకలు సాగించే వారికి ఇవి కనిపించడంలేదు. కొన్ని చోట్ల వీటిపై ఉండే వివరాలు చెరిగిపోయాయి. ఫలితంగా ఇవన్నీ అలంకారప్రాయంగా మారాయి. ఇక మండలంలోని పలు గ్రామీణ ప్రాంత రహదారుల్లోనూ చాలా రాళ్ల పరిస్థితి ఇలాగే ఉంది. ప్రస్తుతం ఇక్కడ పారిశ్రామికవాడ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఇక్కడ మైలు రాళ్లపై ఏ వివరాలు లేకపోవడంతో వచ్చిపోయేవారిని అడుగుతూ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. అధికారులు వీటిపై దృష్టి సారించి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు. ఇదే విషయాన్ని ర.భ.శా. ఏఈ నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, త్వరలోనే నిర్వహణ చేపట్టి అందరికీ కనిపించేలా చూస్తామన్నారు.



ఎన్.నర్సాపురంలో మార్గంలో ఇలా



పాటిమీద-వేంపాడు మార్గంలో కనరాని వివరాలు



నర్సీపట్నం-అడ్డురోడ్డు మధ్య పలు చోట్ల మైలు రాళ్లు ఇలా

సాగునీటి కష్టాలు తీరేదెప్పుడో?

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం మండలంలో వరాహ నదిపై నిర్మించిన పెదగుమ్ములూరు గ్రోయిన్ కోతకు గురికావడంతో ఖరీఫ్ సాగుకు నీరందక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ గ్రోయిన్‌పై ఆధారపడి ఉన్న సాగునీటి కాలువల ద్వారా పెదగుమ్ములూరు, చినగుమ్ములూరు, గోకులపాడు, భీమవరం, గెడ్డపాలెం గ్రామాలకు సాగునీరందుతుంది. వరాహ నదిపై ఎస్.రాయవరం మండల పరిధిలో మొదటి గ్రోయిన్ ఇదే. ఈ గ్రోయిన్ ఏడేళ్ల ఏళ్ల క్రితం దెబ్బతింది. 2019 ఎన్నికలకు ముందు అప్పటి తెదేపా ప్రభుత్వం మరమ్మతులకు రూ. 40 లక్షలు మంజూరు చేసింది.



కోతకు గురైన పెదగుమ్ములూరు గ్రోయిన్

జలవనరుల శాఖ అధికారులు పనులు ప్రారంభించక ముందే ఎన్నికలు వచ్చాయి. వైకాపా అధికారంలోకి వచ్చాక ఈ నిధులు వెనక్కివెళ్లిపోయాయి. దానికితోడు వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో సాగునీటి వనరుల నిర్వహణపై నిర్లక్ష్యం వహించడంతో గ్రోయిన్ మరమ్మతుల ఊసే లేకుండాపోయింది. అప్పటి నుంచి ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఏటా వరదనీటి ఉద్ధృతి కారణంగా మరింత కోతకు గురవుతూ ప్రస్తుతం 25 మీటర్ల మేర గ్రోయిన్ కొట్టుకుపోయింది. దీని వల్ల సుమారు అయిదు గ్రామాల పరిధిలోని 1,900 ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదు. ప్రతి ఏడాది ఖరీఫ్ సాగు సమయంలో గోకులపాడు, భీమవరం, గెడ్డపాలెం రైతులు బృందంగా వెళ్లి గ్రోయిన్ వద్ద ఇసుక బస్తాలతో తాత్కాలికంగా గట్టు నిర్మిస్తున్నారు. వెంటనే వరదలు వచ్చి తాత్కాలిక నిర్మించిన గట్టు



తాత్కాలిక గట్టు నిర్మిస్తున్న రైతులు (పాతచిత్రం)

కొట్టుకుపోతోంది. దీంతో రైతుల కష్టం నీటిపాలవుతోంది. ప్రస్తుతం కూడా ఇదే పరిస్థితి నెలకొంది. నదిలో నీరంతా గ్రోయిన్ నుంచి దిగువ ప్రాంతాలకు వెళ్లిపోవడంతో, నీటి ఉద్ధృతి తగ్గిన తరవాత కాలువలకు నీరందని పరిస్థితి ఏర్పడుతోంది. కూటమి ప్రభుత్వం సాగునీటి వనరులపై దృష్టి సారించి, గ్రోయిన్లకు మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

పెదగుమ్ములూరు గ్రోయిన్ మరమ్మతులకు చేపట్టడానికి ప్రతిపాదనలు పంపించాం. గ్రోయిన్ 25 మీటర్ల మేర కోతకు గురైనట్లు గుర్తించాం. వరదనీటి ప్రవాహం సాగునీటి కాలువ వైపు ఎక్కువగా ఉండడంతో గ్రోయిన్ మరింత కోతకు గురవుతోంది. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. నిధులు మంజూరైతే పనులు చేపడతాం. **– అమీనా భాను,** ఏఈ, జలవనరుల శాఖ, ఎస్.రాయవరం

పండగ వేళ తాగునీటికి పడిగాపులు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో పండగ వేళ మహిళలకు తాగునీటి కష్టాలు తప్పలేదు. పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా కాక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో వారంలో మూడు రోజులు నీటి సరఫరా చేయడం గగనంగా మారింది. వీధి కుళాయిల వద్ద మహిళలు సిగపట్లు పడుతున్నారు. కాలం చెల్లిన పాత తాగునీటి పథకాల వల్ల పురప్రజలకు కష్టాలు తప్పడం లేదు. గురువారం కుళాయిల వద్ద నిరీక్షించిన వారికి కనీసం రోజుమొత్తం మీద బిందె నీరు దొరకడం కష్టంగా మారింది. పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా అయ్యేలా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని మహిళలు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో భారీ రక్షిత నీటి పథకానికి నిధులు మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పురపాలక శాఖ మంత్రి నారాయణను కోరారు. అమరావతి సచివాలయంలో గురువారం మంత్రిని కలిశారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన సమస్యలను ఆయనకు వివరించారు. రామారాయుడుపాలెం గ్రామం వంతెన, యానాద్రి కాలువ మరమ్మతులు, పట్టణంలో భూగర్భ డ్రైనేజీ పనులకు నిధుల గురించి మాట్లాడారు. నిధులు మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.



కుళాయి వద్ద మహిళల ఎదురుచూపు

అవీ ఇవీ

విధుల్లోకి కార్యదర్శుల చేరిక

కోటవురట్ల: మండలంలోని పలు పంచాయతీల్లో కార్యదర్శులు గురువారం పలువురు బాధ్యతలు చేపట్టారు. మధుసూదనరావు, (సుంకపూర), ప్రశాంత్ (రామచంద్రపురం) కె.రాజు (గొట్టివాడ), కె.చంద్రకాంత్ పడాల్ (జోడపాలెం), గంగాధర (జల్లూరు), నాగరత్నం (బౌడవాడ), భాను ప్రకాష్ (అన్నవరం) బదిలీపై వచ్చారు. ఈ స్థానాల్లో పని చేసినవారు వేరే ప్రాంతానికి బదిలీ అయ్యారని ఎంపీడీఓ కాశీ విశ్వనాథరావు చెప్పారు.

మానసిక ప్రశాంతత ముఖ్యం

మునగపాక, న్యూస్‌టుడే: మానసిక ప్రశాంతత ముఖ్యమని, ఒత్తిడికి దూరంగా ఉండాలని మునగపాక వైద్యాధికారి ఎన్. విమలగిరి అన్నారు. మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం మునగపాకలో ర్యాలీ చేపట్టారు. సీహెచ్ఓ ఆర్.దేవకాంత, హెల్త్ సూపర్‌వైజరు నాగేశ్వరరావు, అనూరాధ పాల్గొన్నారు.

నిందితులకు రూ. 90 వేల జరిమానా

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి మాదిగపేటలో 2021లో జరిగిన గొడవలో నిందితులకు రూ. 90 వేల జరిమానా విధిస్తూ స్థానిక ఏజేఎస్ కోర్టు న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని పట్టణ ఎస్సై సావిత్రి తెలిపారు. అప్పట్లో బాను కనకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యిందన్నారు.

వీఆర్ఏల సంఘం గౌరవాధ్యక్షురాలిగా నర్సమ్మ

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి మండల వీఆర్ఏల సంఘం గౌరవాధ్యక్షురాలిగా జి. అప్పలనర్సమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనకాపల్లిలో గురువారం మండల వీఆర్ఏల సమావేశం నిర్వహించారు. అధ్యక్షులుగా ఎస్‌కేఆర్ బాషా, కార్యదర్శిగా చోడే అర్జునరావు, కోశాధికారిగా అభిరామ్‌ను ఎన్నుకున్నారు.

ఆక్రమణల తొలగింపు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: జలవనరుల శాఖ స్థలంలో వెలసిన ఆక్రమణలను అధికారులు తొలగించారు. పాయకరావుపేట తాండవ చక్కెర కర్మాగారం వద్ద ఉన్న భూమి కాలువ గట్టు సహా స్థలాన్ని ఆక్రమించి షెడ్డు వేశారు. దీనిపై స్పందించిన జలవనరుల శాఖ ఏఈ శ్రీరామమూర్తి తన సిబ్బందితో వెళ్లి షెడ్డును తొలగించారు. స్థలం చుట్టూ వేసిన రేకుల ప్రహరీని పడగొట్టారు.

బాధ్యతగా పల్లె పండగ

కశింకోట, న్యూస్‌టుడే: ఈనెల 14 నుంచి జరిగే పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాలను అంతా బాధ్యతగా చేపట్టాలని ఎంపీడీవో వీవీ రవికుమార్ సూచించారు. కశింకోట మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పంచాయతీలో పారిశుద్ధ్య పనులు, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలపై వివరించారు. ఉపాధి హామీ పథకం పనులపై సమీక్ష నిర్వహించారు. ఈఓఆర్‌డీ ఎం. వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

తాతయ్యబాబుకు ప్రగడ సత్కారం

ఎలమంచిలి, న్యూస్‌టుడే: రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన బత్తుల తాతయ్యబాబును గురువారం విజయవాడలో ఎలమంచిలి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు కలిసి సత్కరించారు. తాతయ్యబాబు అంకితభావం, కృషికి లభించిన పదవి ఇది అని కొనియాడారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి - 80085 74722
ఎలమంచిలి - 80085 74726
పాయకరావుపేట - 80085 74749

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే:

?: తుమ్మపాల పంచాయతీ పరిధిలో వాటర్ హెడ్ వర్క్స్ వెళ్లే మార్గంలో మురుగు రోడ్డుపైకి వస్తోంది. సమస్యను పరిష్కరించగలరు.

– మహేష్, తుమ్మపాల

✓: మురుగు కాలువలు నిర్మించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

– ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి, తుమ్మపాల

దుర్గాదేవీ నమోస్తుతే

అనకాపల్లి, కొత్తూరు (అనకాపల్లి), కశింకోట, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం కనకదుర్గమ్మ దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పిసినికాడ అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాళ్లపాలెం, నర్సింగపల్లి, కొత్తూరు కళాశాల కూడలిలో ఉన్న కనకదుర్గమ్మ మండపాలను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, తెదేపా జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ వేర్వేరుగా దర్శించుకుని పూజలు చేశారు. పెద్దిరాజుపేట తాడేశ్వరి సాయిశివాని ఆలయంలో అమ్మవారిని కాళీమాతగా అలంకరించారు. అమ్మవారి సన్నిధిలో సహస్రదీపాలంకరణ చేశారు. బైపాస్ రోడ్డులోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఏడు వేల మంది మహిళలకు వాయినాలు అందజేశారు. వీటికి కాంగ్రెస్ నాయుడు, మళ్ల జగ్గఅప్పారావు దంపతులు ఆర్థికసాయం అందజేశారు.



మహిళలకు వాయినాలు అందిస్తున్న నిర్వాహకులు



మునగపాకలో కుంకుమ పూజలు

ఎస్.రాయవరం, కోటవురట్ల, నక్కపల్లి: ఎస్‌రాయవరం మండలం అడ్డురోడ్డులో ఆలయ అర్చకుడు సతీష్ అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కోటవురట్ల మండలం కైలాసపట్నంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి వద్ద, గొట్టివాడ గణపతి ఆలయంలో అమ్మవారిని పసుపుతో అలంకరించారు. జోడపాలెంలో మహిళలు కుంకుమ పూజ చేశారు. బంగారంపేటలో భవానీ దీక్ష పరులు దుర్గాదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కలశాల ఊరేగింపు నిర్వహించారు. నక్కపల్లిలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ వీసం రామకృష్ణ, ఉప ఎంపీపీ వీసం నానాజీ ఆధ్వర్యంలో అరటి దొప్పలతో అందమైన మండపాలను నిర్మించి, అంబలం పూజ నిర్వహించారు.

అచ్యుతాపురం, మునగపాక, న్యూస్‌టుడే: హరిపాలెం- అందలాపల్లిలోని భగీరథీ అమ్మవారి ఆలయంలో గురువారం నవదుర్గల పూజలు నిర్వహించారు. మునగపాక వల్లభుడి వినాయక కోవెల ప్రాంగణంలో నెలకొల్పిన దుర్గాదేవి వద్ద గురువారం రాత్రి మహిళా భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. వాడ్రాపల్లిలో దుర్గాదేవి సారె ఊరేగింపు జరిగింది. ఉమ్మలాడలో దుర్గాదేవిని గాజులతో అలంకరించారు. మునగపాక వైఎస్ఆర్ మార్కెట్ యార్డులో నెలకొల్పిన దుర్గాదేవి విగ్రహం వద్ద అంబలం పూజ ఏర్పాటు చేశారు.



పిసినికాడలో దుర్గాదేవిగా..



రేగుపాలెంలో అమ్మవారు



జి.భీమవరంలో సారెను ఊరేగిస్తున్న మహిళలు

అలరించిన నృత్యప్రదర్శన

పాయకరావుపేట, న్యూస్‌టుడే: బాలికల నృత్య ప్రదర్శన అలరించింది. పట్టణంలోని బృందావనంలోని దుర్గాదేవి వద్ద శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కూచిపూడి, భరతనాట్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. బాలికల నృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి. కాగితలో జరుగుతున్న శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా వివిధ దేవుళ్ల వేషధారణలో భక్తులు అలరించారు.

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ కాలనీ, కొక్కిరాపల్లి, తురంగలపాలెం, రేగుపాలెం తదితర ప్రాంతాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు.



బంగారంపేటలో కలశాల ఊరేగింపు



భగీరథీ ఆలయంలో శంఖచక్ర ఆకారంలో దీపాలంకరణ



కాగితలో పుష్పాలతో..



మునగపాకలో గాజులతో..

రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

స్పందనకు వందనం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: వరి రైతులకు కొరత లేకుండా యూరియా సరఫరా చేస్తామని మండల వ్యవసాయాధికారి గోవింద శంకర్ తెలిపారు. ఎరువుల కోసం రైతులు పరుగు శీర్షికతో 'ఈనాడు'లో గురువారం ప్రచురించిన కథనానికి వ్యవసాయాధికారులు స్పందించారు. హరిపాలెం, కొండకర్ల రైతు సేవా కేంద్రాల్లో 12 టన్నులు, తిమ్మరాజుపేట సొసైటీలో 25 టన్నులు, మడుతూరు, దుప్పితూరులో 10 టన్నుల చొప్పున యూరియాను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. మండలంలో 50 టన్నుల యూరియా నిల్వలు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు.



హరిపాలెం రైతు సేవా కేంద్రానికి వచ్చిన యూరియా

అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి ఈ-శ్రమ్

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: దేశంలోని అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ-శ్రమ్ పథకంలో కార్మికులంతా నమోదు కావాలని కార్మిక శాఖ అధికారి కూడ బాలకృష్ణ కోరారు. అనకాపల్లిలోని ముఠా కార్మికులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఠా కార్మికులను ఈ పథకంలో నమోదు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. నమోదైన కార్మికులకు రూ. రెండు లక్షల ప్రమాద బీమా, రూ. లక్ష అంగ వైకల్య బీమా వర్తిస్తుందన్నారు. ముఠా కార్మికులతోపాటు భవన, ఇతర నిర్మాణ కార్మికులు, చిల్లర వర్తకులు, తోపుడు బళ్ల కార్మికులు నమోదు కావాలని కోరారు. సీఐటీయూ నాయకులు గంటా శ్రీరామ్, సైదుబాబు, మంద రాము పాల్గొన్నారు.



కార్మికులు, నేతలతో బాలకృష్ణ

తోటి విద్యార్థినికి స్నేహితుల తోడ్పాటు

నక్కపల్లి, న్యూస్‌టుడే: తమతోపాటు కలిసి చదువుకున్న విద్యార్థిని వైద్యానికి స్నేహితులంతా తోడ్పాటు అందించారు. ఉపమాక గ్రామానికి చెందిన భార్గవికి రూ. 40 వేల ఆర్థిక సహాయాన్ని స్నేహితులు అందించారు. నక్కపల్లి నుంచి ఉపమాక వెళ్లే మార్గంలో భార్గవికి తలకు బలమైన గాయమవడంతో, కాకినాడ అపోలో ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించారు. ఈ విషయం తెలుసుకున్న 2001 పదో తరగతి చదువుకున్న పలువురు స్నేహితులు ఈమెను పరామర్శించి, తమవంతుగా ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు.

ఆర్మీ వాహనానికి త్రుటిలో తప్పిన ప్రమాదం

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పి.ఎల్.పురం వద్ద జాతీయ రహదారిపై సైనిక ఆయుధసామగ్రి తరలిస్తున్న ఆర్మీ వాహనం ప్రమాదానికి గురైంది. దీంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. చెన్నై ఆర్మీ క్యాంపు నుంచి ఒడిశా వైపు వెళ్తున్న భారీ ఆర్మీ వాహనాల శ్రేణి వెళుతోంది. ముందు పైలెట్ వాహనం సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న పార్సిల్ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ సుధాకర్‌రాజు కాలికి తీవ్రగాయమైంది. దీంతో గాయపడిన బాధితుడిని చికిత్స నిమిత్తం తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం కారణంగా విశాఖవైపు వెళుతున్న మార్గంలో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో వాహనాలు నిలిచిపోయాయి. పేట పోలీసులు సంఘటన జరిగిన ప్రదేశానికి చేరుకుని ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించారు.



ఘటనా స్థలంలోని దృశ్యం

రతన్ టాటా మృతి తీరని లోటు

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), మునగపాక, న్యూస్‌టుడే: దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటా మరణం ఆర్థిక వ్యవస్థకు తీరనిలోటని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేలాది మందికి ఉద్యోగాలు కల్పించిన టాటా నిరుద్యోగ సమస్యను గట్టెక్కించారన్నారు. రూ. వేల కోట్లు దేశాభివృద్ధి ఉదారంగా ఇచ్చారని గుర్తుచేశారు. దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయంగా ఉండిపోతాయన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు. మునగపాకలో రతన్‌టాటా చిత్రపటానికి మండల జనసేన అధ్యక్షుడు పూల మాల వేసి నివాళులర్పించారు.

పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత

ఎలమంచిలి, న్యూస్‌టుడే: వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఎలమంచిలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి కోరారు. గురువారం ఎలమంచిలి పట్టణంలో స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక రాజీవ్ క్రీడామైదానంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలసి శ్రమదానం చేశారు. మున్సిపల్ కమిషనర్ బాకూరి ప్రసాదరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఆడారి పూరీ జగన్నాథం పాల్గొన్నారు.



ఎలమంచిలి క్రీడామైదానాన్ని శుభ్రం చేస్తున్న విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది

నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల, న్యూస్‌టుడే: కోటవురట్లలో స్వచ్ఛతే సేవ కార్యక్రమాన్ని చేపట్టారు. మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ, ఎంపీడీఓ కాశీ విశ్వనాథరావు శుభ్రం చేశారు. అనంతరం స్వచ్ఛ భారత్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నక్కపల్లి హైవే పక్కన, సంత ప్రాంగణం, ఆసుపత్రి వద్ద మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు, ఎంపీడీఓ సీతారామరాజు, ఈఓఆర్డీ సత్యనారాయణ శుభ్రత పనులు నిర్వహించారు. అదే విధంగా ఎస్.రాయవరం మండలంలో కూడా, మండల ప్రత్యేకాధికారిణి సుబ్బలక్ష్మీ, ఎంపీడీఓ సత్యనారాయణ, సర్పంచి అప్పారావు వివిధ శాఖల అధికారులతో కలిసి కార్యాలయాల వద్ద శుభ్రం చేశారు.

రహదారికి కొత్తరూపు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని రాజుగారిబీడులోని రహదారికి కొత్తరూపు వచ్చింది. ఎంపీడీఓ జయప్రకాష్ సహా అధికారులు, సిబ్బంది కలిసి స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్యం మెరుగు పనులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ చంద్రశేఖర్, వర్మ పాల్గొన్నారు.



చెత్త తొలగిస్తున్న పేట అధికారులు, పంచాయతీ సిబ్బంది

రాంబిల్లి, మునగపాక, న్యూస్‌టుడే: రాంబిల్లిలో స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రసాదరావు పలుచోట్ల పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఎంపీడీఓ ఎన్. జయమాధవి, ఈఓపీఆర్డీ బి.వి.ఎస్.రాజు పాల్గొన్నారు. మునగపాకలో సాగునీటి కాలువల్లో చెత్త పోస్తున్న వ్యాపారులను డీఎల్‌డీఓ మంజులవాణి మందలించారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, సర్పంచి దిమ్మల అప్పారావు వైద్యాధికారిణి స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల్లో త్వరితగతిన విచారణ

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పెండింగు కేసులపై దృష్టి సారించాలన్నారు. బాధితులకు పరిహారం చెల్లింపుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్పీ దీపిక మాట్లాడుతూ పౌర హక్కుల దినోత్సవాల నిర్వహణపై కమిటీ సభ్యులకు సమాచారం అందిస్తామన్నారు. జిల్లాలో పెండింగ్ కేసులు వివరాలను జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె. రాజేశ్వరి తెలియజేశారు. 293 కేసులు విచారణలో ఉన్నాయన్నారు. 16 మందికి రూ. 21 లక్షలు పరిహారం చెల్లింపు పెండింగ్‌లో ఉందన్నారు. కమిటీ సభ్యులు అప్పలరాజు మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన న్యాయ సంహిత సెక్షన్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. కళాశాలల్లో డ్రగ్స్ వినియోగానికి అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, ఆర్డీఓలు రమణ, షేక్ ఆయిషా, డీఎస్పీలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణమూర్తి, కమిటీ సభ్యులు, ఇంద్రావతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, చిత్రంలో జేసీ జాహ్నవి, ఎస్పీ దీపిక



అలా నీలి సంద్రం... అబ్బో భలే అందం

దసరా సెలవులకు పెద్ద సంఖ్యలో విశాఖ వస్తున్న పర్యాటకులు కైలాసగిరి నుంచి నగర అందాలను తిలకించి మైమరచిపోతున్నారు. ఎటు చూసినా పచ్చదనంతో కట్టిపడేసే కైలాసగిరి పైనుంచి కను చూపు మేర నీలి సంద్రం సొబగులను తిలకించేందుకు రెండు కళ్లూ చాలవంటూ పరవశించిపోతున్నారు. కొండలపైనుంచి సాగరాన్ని ఇలా దగ్గరగా చూసేందుకు అవకాశం రాష్ట్రంలో అతి కొద్ది ప్రాంతాల్లోనే ఉంది. – ఈనాడు, విశాఖపట్నం

గజలక్ష్మిగా కనకమహాలక్ష్మి


బంగారు చీర అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాతనగరంలోని బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారు గజలక్ష్మి అలంకరణలో భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. పవర్ పయనీర్స్ సంస్థ అధినేత ఎ.రామిరెడ్డి అలంకరణకు అవసరమైన గాజులను సమకూర్చేందుకు రూ.1.25 లక్షలు అందజేశారు. అమ్మవారికి నివేదించిన గాజులను శుక్రవారం దర్శనాలకు వచ్చే భక్తులకు అందజేయనున్నట్లు ఈఓ శోభారాణి తెలిపారు. అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మి అలంకరణలో దర్శనమివ్వనున్నారు. –న్యూస్‌టుడే, విశాఖపట్నం

లారీ, ఆర్టీసీ బస్సు ఢీ

నలుగురికి తీవ్ర గాయాలు


ప్రమాదానికి గురైన బస్సు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కొందరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్.రాయవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ నుంచి ఆర్టీసీ సూపర్ లగ్జరీ నాన్‌స్టాప్ బస్సు 36 మంది ప్రయాణికులతో విశాఖపట్నం బయలుదేరింది. పెనుగొల్లు వద్ద ముందు వెళ్తున్న లారీ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై విభీషణరావు బస్సును పరిశీలించి, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వీరవరానికి చెందిన బస్సు డ్రైవర్ ఎం.తాతాజీ, విశాఖపట్నానికి చెందిన ఐ.ఎస్.ఎన్.రాజు, ఒడిశాకు చెందిన కె.చంద్ర సబత్, రంజన్ పంగి తలకు గాయాలయ్యాయి. వీరితోపాటు విజయనగరానికి చెందిన ఎం. చాణక్య, కాకినాడకు చెందిన రత్నకుమార్, వరప్రసాద్, వైజాగ్‌కు చెందిన మురళీకృష్ణ, నూకరత్నం, ఉమామహేశ్వరి స్వల్పంగా గాయపడ్డారు. వీరందరినీ నక్కపల్లి సామాజిక ఆసుపత్రి, పెనుగొల్లు ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం పలువురు క్షతగాత్రులను విశాఖ తరలించారు. బస్సులో మిగిలిన ప్రయాణికులు వేరే బస్సుల్లో విశాఖపట్నం వెళ్లారు. రోడ్డు మధ్యలో ప్రమాదం జరగడంతో ట్రాఫిక్ భారీగా నిలిచింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విభీషణరావు తెలిపారు.


తీవ్రంగా గాయపడిన డ్రైవర్ తాతాజీ, రాజు, చంద్ర సబత్

గ్రావెల్ అనధికార తవ్వకాలకు అడ్డుకట్ట

కోటవురట్ల, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు, తరలిస్తున్న పొక్లెయిన్, రెండు గ్రావెల్ ట్రాక్టర్లను గురువారం పోలీసులు పట్టుకున్నారు. అన్నవరం దగ్గర ఉన్న ఏలేరు కాలువ సమీపంలో వేములపూడికి చెందిన కొంతమంది గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీస్ సిబ్బంది దాడి చేసి వారిని పట్టుకొని ఆరా తీయగా, తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవని నిర్ధారణ కావడంతో అక్రమదారులపై కేసు నమోదు చేశారు. ట్రాక్టర్లు, పొక్లెయిన్ సీజ్ చేసినట్లు పోలీసులు చెప్పారు.

అందరి ఆరోగ్యమే లక్ష్యంగా..

పల్లె జనాలకు టాటాట్రస్ట్ సేవలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే

ఆరోగ్యమే మహాభాగ్యం అని పెద్దలు చెబుతున్నా అనారోగ్యం దాడిచేసే వరకు దీని గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోరు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రభుత్వం పోషకాహారం అందిస్తోంది. అవగాహన లోపం వల్లనో.. నిర్లక్ష్యం వల్లనో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వీటిని సరిగా వినియోగించుకోవడం లేదు. దీంతో పోషకాహార లోపంతో చాలామంది సతమతమవుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపించడానికి టాటా ట్రస్ట్ విలువైన సేవలందిస్తోంది. ఏషియన్ పెయింట్స్ సంస్థతో కలిసి జిల్లాలోని పల్లె జనాలకోసం విస్తృత స్థాయి కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

అనకాపల్లి జిల్లాలో అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక మండలాల్లో ఎంపిక చేసిన 32 గ్రామాల్లో టాటా ట్రస్ట్, ఏషియన్ పెయింట్స్ సంయుక్తంగా విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవలందిస్తున్నాయి. మహిళలకు పోషకాహారం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి పోషణ సఖీలను నియమించారు. వీరంతా రోజూ గ్రామాల్లో తిరుగుతూ ఆరోగ్య సమస్యలతోపాటు రక్తహీనత, పిల్లల ఆరోగ్యం, ఎదుగుదల, బరువు, గర్భిణులకు పోషకాహారం అందజేత, తల్లిపాల వల్ల తల్లీబిడ్డలకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు. అంగన్‌వాడీల్లో అందిస్తున్న పోషకాహారం ఏవిధంగా ఉపయోగపడుతుందీ తెలియజేయడంతోపాటు వాటి వినియోగంపై ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. వయసుకు తగ్గ ఎత్తు, బరువులేని పిల్లలు ఈవిధంగా ఉండడానికిగల కారణాలు తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. ఐదేళ్లలోపు చిన్నారులు, గర్భిణులు, బాలింతల వివరాలను అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల ద్వారా తెలుసుకొని పోషణ సఖీలు వారి ఇళ్లకు వెళ్లి పోషకాహార ప్రాముఖ్యం తెలియజేస్తున్నారు. అచ్యుతాపురంలో 9 గ్రామాల్లో 11మంది పోషణ సఖీలు, రాంబిల్లిలో 15 మంది, మునగపాక మండలంలో 8 మంది ఆరోగ్యవంతమైన సమాజం కోసం అనునిత్యం కృషి చేస్తున్నారు. పోషణ సఖీల పనితీరు వల్ల రక్తహీనతతో ఉండే వారి సంఖ్య తగ్గడంతోపాటు బరువు, ఎత్తు తక్కువ ఉండే పిల్లలు సంఖ్యలోనూ అనుకూల మార్పులు వస్తున్నాయి. పోషణ సఖీలకు నిరంతరం అవగాహన కల్పించడానికి న్యూట్రిషన్‌లో బీఎస్సీ పూర్తి చేసిన వారిని మండలానికి ఒకరు చొప్పున నియమించారు. పోషణ సఖీలు నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ఆంధ్రా విశ్వవిద్యాలయ విద్యార్థులు, ప్రొఫెసర్లు హాజరవుతున్నారు.


పోషకాహారం ప్రాధాన్యతను వివరిస్తున్న ఏయూ విద్యార్థులు, పోషణ సఖీలు (దాచినచిత్రం)



సద్వినియోగం చేసుకుంటున్నారు: అంగన్‌వాడీల ద్వారా విలువైన పోషకాహారం అందుబాటులో ఉన్నా దీనిపై సరైన అవగాహన లేక గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వినియోగించుకోవడం లేదు. పల్లె జనాలకు వీటిపై అవగాహన కల్పించడం ద్వారా సద్వినియోగం చేసుకుంటున్నారు. వయస్సు తగ్గ ఎత్తు, బరువు లేని పిల్లల వివరాలు సేకరించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేస్తున్నాం. దీని వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి. దీని వల్ల రక్తహీనత సమస్య ప్రజల్లో తగ్గడంతోపాటు చిన్నారులు వయస్సుకు తగ్గ బరువు పెరుగుతున్నారు.
– ఉషారాణి, పోషణ సఖీ, ఖాజీపాలెం.



క్రమం తప్పకుండా కార్యక్రమాలు: టాటా ట్రస్ట్, ఏషియన్ పెయింట్స్, విజయవాహిని చారిటబుల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో రెండేళ్లగా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, పౌష్టికాహార ప్రదర్శన కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నాం. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల నుంచి వివరాలను సేకరించి పోషకాహారం ప్రాధాన్యాన్ని ఇంటింటా వివరిస్తున్నాం. ఆరోగ్యవంతమైన సమాజం కోసం పనిచేయడం ఆనందంగా ఉంది.
– సంతోషి, పోషణ సఖీ, తిమ్మరాజుపేట

'రతన్ టాటా' చొరవతోనే క్యాన్సర్ సేవలు

అగనంపూడి, న్యూస్‌టుడే : విశాఖ శివారు అగనంపూడిలో దివంగత రతన్ టాటా కృషితో ఏర్పాటు చేసిన హోమీ బాబా క్యాన్సర్ ఆసుపత్రి.. నేడు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు, ఇతర ప్రాంత ప్రజలకు ఆరోగ్య ప్రదాయినిగా ఉంది. ఆయన ఛైర్మన్‌గా ఉన్న ముంబయి టాటా స్మారక కేంద్రం నోడల్ ఏజెన్సీగా వ్యవహరించడానికి ముందుకు రావడంతోనే విశాఖలో ఆసుపత్రి నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. కేంద్ర అణుశక్తి మంత్రిత్వ శాఖ తొలుత కోల్‌కతా, త్రివేండ్రం, ఇతర నగరాల్లో ఆసుపత్రి ఏర్పాటుకు ప్రతిపాదించినా... టాటా సంస్థ ప్రతినిధులు విశాఖ వైపే మొగ్గు చూపారు. 2009లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఎకరా రూ.1.50 లక్షల చొప్పున 76 ఎకరాలను కేటాయించింది. 2014లో భవనాల నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఓవైపు పనులు జరుగుతుండగానే తాత్కాలికంగా కంటైనర్లలో వైద్య సేవలు ప్రారంభించారు. కట్టడాల నిర్మాణం పూర్తికావడంతో వైద్య విభాగాలను తరలించారు. ప్రస్తుతం పక్కా భవనాల్లో అత్యాధునిక వైద్య సౌకర్యాలతో క్యాన్సర్ వ్యాధికి చికిత్స అందిస్తున్నారు. విశాఖ నగర వాసులు రతన్ టాటా మృతికి సంతాపం ప్రకటించారు.

ఈనాడు ప్రతిభ

pratibha.eenadu.net/eenadupratibha.net

విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్

✦ భారత వాయుసేన (ఐఏఎఫ్) ఇటీవల వెపన్ సిస్టమ్స్ స్కూల్ (డబ్ల్యూఎస్ఎస్)ను ఏ నగరంలో ప్రారంభించింది?
జ: హైదరాబాద్



✦ నెదర్లాండ్స్ నూతన ప్రధానమంత్రిగా ఇటీవల ఎవరు బాధ్యతలు చేపట్టారు?

మాదిరి ప్రశ్నలు

(ఈయన గతంలో దేశ గూఢచారి చీఫ్‌గా పనిచేశారు.)
జ: డిక్ స్కూఫ్

✦ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఎవరిని అదనపు జాతీయ భద్రతా సలహాదారు (అడిషనల్ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్)గా నియమించింది? (ఈయన గతంలో రిసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్‌కి చీఫ్‌గా పనిచేశారు. ఈయనతోపాటు టీవీ రవిచంద్రన్, పవన్ కపూర్‌లను కేంద్రం డిప్యూటీ జాతీయ భద్రతా సలహాదారులుగా నియమించింది. నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్ (ఎన్ఎస్‌సీఎస్)కు ప్రధాని మోదీ నాయకత్వం వహిస్తారు. జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ డోభాల్ ఎన్ఎస్‌సీఎస్‌కు కార్యదర్శిగా వ్యవహరిస్తారు.)
జ: రాజీందర్ ఖన్నా

✦ షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ 24వ సమావేశాన్ని ఇటీవల ఎక్కడ నిర్వహించారు? జ: ఆస్తానా, కజకిస్థాన్


మరింత సమాచారం

ప్రిపరేషన్ టెక్నిక్

పాఠ్య పుస్తకాన్ని సాధారణ పద్ధతుల్లో చదివి పక్కన పెట్టేయకూడదు. గ్రహించిన అంశాన్ని సంక్షిప్తంగా రాసుకోవడం, ప్రశ్నలు వేసుకుని సమాధానాలు చెప్పడం, అర్థం చేసుకున్న విషయాన్ని పక్కవారికి బోధించడం మొదలైన క్రియాశీలక చర్యల ద్వారా అధ్యయనం చేస్తే బాగా గుర్తుంటుంది.

డీఎస్సీ - 2024
తెలుగు కంటెంట్

JUNIOR INTER
Mathematics - IB



Distance between the points..

2 Marks Three Dimensional Coordinates

1) Find the distance of P(3, –2, 4) from the origin.

A: O(0, 0, 0), P(3, –2, 4)

$OP = \sqrt{(x_2-x_1)^2 + (y_2-y_1)^2 + (z_2-z_1)^2}$

$= \sqrt{9+4+16} = \sqrt{29}$

2) Find the distance between the points (3, 4, –2) and (1, 0, 7).

A: A(3, 4, –2), B(1, 0, 7)

$AB = \sqrt{(1-3)^2 + (0-4)^2 + (7+2)^2}$

$= \sqrt{4+16+81} = \sqrt{101}$

3) Find x if the distance between (5, –1, 7) and (x, 5, 1) is 9 units.

A: A(5, –1, 7), B(x, 5, 1)

AB = 9

$\sqrt{(x-5)^2 + (5+1)^2 + (1-7)^2} = 9$

$(x-5)^2 + 36 + 36 = 81$

$x^2 + 25 - 10x + 72 = 81 \Rightarrow x^2 - 10x + 16 = 0$

$x^2 - 8x - 2x + 16 = 0 \Rightarrow (x-2)(x-8) = 0 \Rightarrow x = 2, 8$

4) Show that the points (2, 3, 5), (–1, 5, –1) and (4, –3, 2) form a right angled isosceles triangle.

A: A(2, 3, 5), B(–1, 5, –1), C(4, –3, 2)

$AB = \sqrt{9+4+36} = \sqrt{49} = 7$

$BC = \sqrt{25+64+9} = \sqrt{98} = 7\sqrt{2}$

$CA = \sqrt{4+36+9} = \sqrt{49} = 7$

AB = CA

$\therefore AB^2 + CA^2 = 49 + 49 = 98$

$AB^2 + CA^2 = BC^2$

∴ Given points form a right angled isosceles triangle.

2 Marks Some More Imp Questions

1) Show that the points (1, 2, 3), (2, 3, 1) and (3, 1, 2) form an equilateral traingle.

2) Show that the points (1, 2, 3), (7, 0, 1) and (–2, 3, 4) are collinear.

3) Show that the points A (3, –2, 4), B(1, 1, 1) and C (–1, 4, –2) are collinear.

For Answers

- U. Prasanna Kumar

SUBSCRIBE CHANNEL

ప్రకృతిలో అపరిమితంగా లభించే స్వచ్ఛమైన ఇంధనం హైడ్రోజన్. నీటితో పాటు ఎన్నోరకాల జీవపదార్థాల్లో హైడ్రోజన్ ఒక భాగంగా ఉంది. ఆధునిక సాంకేతికతతో దీన్ని సంగ్రహించి ఇంధనంగా మారుస్తున్నారు. శిలాజ ఇంధనాలకు భవిష్యత్తు ప్రత్యామ్నాయంగా, వాతావరణ మార్పులకు మేలైన పరిష్కారంగా విస్తృత ఆమోదంతో ఇప్పుడిప్పుడే దీన్ని ఉపయోగంలోకి తెస్తున్నారు. పెట్రోల్ కంటే మూడు రెట్లు అధిక దహన సామర్థ్యం ఉన్న ఉదజని సంగ్రహణ, నిల్వ, వినియోగం జరిగే తీరుపై పోటీ పరీక్షార్థులకు ప్రాథమిక పరిజ్ఞానం ఉండాలి. హైడ్రోజన్ ఇంధనం రకాలు, ఉత్పత్తి విధానాలు, ఇందుకు కావాల్సిన శక్తి వనరులతో పాటు, దీని ఉత్పత్తి, వాణిజ్య ప్రయోజనాలకు ప్రస్తుతం ఉన్న సవాళ్లు, మన దేశం విధించుకున్న లక్ష్యాల గురించి తెలుసుకోవాలి.

స్వచ్ఛం.. సమృద్ధం.. శక్తిమంతం!

జనరల్ స్టడీస్
పర్యావరణ అంశాలు



హైడ్రోజన్ ఇంధనం

ఆవర్తన పట్టికలో మొదటి మూలకం హైడ్రోజన్. ఇది అత్యంత తేలికైంది. అందుకే వాతావరణంలో పైకి చేరుతుంది. శుద్ధమైన స్థితిలో చాలా అరుదుగా ఉంటుంది. స్థిర ఉష్ణోగ్రత పీడనాల వద్ద రంగు, రుచి, వాసన లేని విషరహితమైన అలోహ స్థితిలో ఉంటుంది. ఈ ఇంధనాన్ని ఆక్సిజన్‌తో మండించినప్పుడు వెలువడే ఉద్గారాలు శూన్యం. రవాణా ఇంధనంగా హైడ్రోజన్ మార్కెట్ ప్రారంభ దశలో ఉన్నప్పటికీ, దీన్ని ఫ్యూయెల్ సెల్స్ లేదా అంతర్గత దహన యంత్రాల్లో ఉపయోగించవచ్చు. ఇది అంతరిక్ష నౌకలో ఇంధనంగా కూడా వాడకంలో ఉంది.

గమనిక: హైడ్రోజన్‌ను సహజ వాయువు, జీవద్రవ్యరాశి, అణుశక్తితోపాటు పునరుత్పాదక వనరులైన సౌరశక్తి, పవనశక్తి నుంచి కూడా ఉత్పత్తి చేయవచ్చు.

లభ్యత: వాతావరణంలో అత్యంత సమృద్ధిగా ఉండే మూలకం హైడ్రోజన్. సూర్యుడు, ఇతర నక్షత్రాలు ఎక్కువగా హైడ్రోజన్‌తోనే నిండి ఉంటాయి. విశ్వంలోని 90% పరమాణువులు హైడ్రోజన్ పరమాణువులేనని ఖగోళ శాస్త్రవేత్తల అంచనా. ఇతర మూలకాల కంటే కూడా హైడ్రోజన్ మూలకం ఎక్కువ సమ్మేళనాల్లో భాగంగా ఉంటుంది. నీరు, హైడ్రోకార్బన్లు, ఇతర సేంద్రియ పదార్థాల్లో నిల్వ ఉంటుంది. హైడ్రోజన్‌ను అణుస్థాయిలో నిల్వ చేసే సౌకర్యం అందుబాటులో లేదు.

నిల్వ: పర్యావరణంలో హైడ్రోజన్ సమృద్ధిగా లభిస్తుంది. నీటిలో, హైడ్రోకార్బన్లలో, జీవద్రవ్యరాశిలో నిల్వ ఉంటుంది. హైడ్రోజన్‌ను భౌతికంగా ద్రవ లేదా వాయు స్థితిలో నిల్వ చేయవచ్చు. గ్యాస్‌గా నిల్వ చేయడానికి సాధారణంగా అధిక పీడన ట్యాంకులు అవసరం. ద్రవంగా నిల్వ చేయడానికి క్రయోజెనిక్ ఉష్ణోగ్రతలు కావాలి. ఎందుకంటే దీని మరిగే స్థానం -252.8 °C. * హైడ్రోజన్ ఇంధనాన్ని ఘన పదార్థాల ఉపరితలంపైన శోషణ ప్రక్రియను ఉపయోగించి, లేదా వాటిలోపల అభిశోషణ ప్రక్రియను ఉపయోగించి నిల్వ చేయవచ్చు.

గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు తగ్గించడంలో క్లీన్ హైడ్రోజన్ పరిశ్రమ సామర్థ్యం: హైడ్రోజన్ ఒక స్వచ్ఛమైన ఇంధనం. ఇంధన కణాల్లో దీన్ని వినియోగించినప్పుడు నీటిని మాత్రమే ఉత్పత్తి చేస్తుంది. అందుకే హైడ్రోజన్‌ను నేడు ప్రత్యామ్నాయ ఇంధనంగా పరిగణిస్తున్నారు. గ్యాసోలిన్ (పెట్రోలియం)తో నడిచే వాహనాల కంటే హైడ్రోజన్ వినియోగం మరింత ప్రభావవంతంగా ఉన్నట్లు గుర్తించారు. 1 కేజీ హైడ్రోజన్‌లో ఉన్న శక్తి = 2.8 కేజీల గ్యాసోలిన్ శక్తికి సమానం. FCEVలు ఇప్పుడు దేశీయంగా, ప్రపంచవ్యాప్తంగా స్థానికీకరించిన ప్రాంతాల్లో వినియోగదారుల మార్కెట్‌లో పరిమితంగా అందుబాటులో ఉన్నాయి.

* గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (గెయిల్) మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో హైడ్రోజన్‌ను సహజ వాయువు వ్యవస్థలో కలిపే భారతదేశపు తొలి ప్రాజెక్టును ప్రారంభించింది. ప్రస్తుతం గ్రే హైడ్రోజన్‌ను కలుపుతుండగా, తర్వాత దీనిస్థానంలో గ్రీన్ హైడ్రోజన్‌ను చేరుస్తారు. ఇండోర్‌లో హైడ్రోజన్ మిశ్రమ సహజ వాయువుని సీఎన్‌జీ వాహనాలకు, పైప్డ్ నేచురల్ గ్యాస్‌ను ఇళ్లలో వినియోగానికి సరఫరా చేస్తున్నారు. హెచ్‌పీసీఎల్, గెయిల్ కంపెనీల ఉమ్మడి భాగస్వామ్య సంస్థ 'అవంతికా గ్యాస్ లిమిటెడ్' ద్వారా ఈ సరఫరా జరుగుతోంది.

వాణిజ్య స్థాయిలో హైడ్రోజన్ వినియోగానికి ఉన్న సవాళ్లు: 1) గ్రీన్ హైడ్రోజన్, బ్లూ హైడ్రోజన్ సంగ్రహణకు ఆర్థిక స్థిరత్వం అవసరం. అప్పుడే హైడ్రోజన్ ఇంధనాన్ని వాణిజ్య స్థాయిలో ఉపయోగించడానికి వీలవుతుంది. 2) కార్బన్ సంగ్రహం, స్టోరేజీ, హైడ్రోజన్ ఫ్యూయెల్ సెల్ టెక్నాలజీ లాంటి హైడ్రోజన్ ఉత్పత్తి, వినియోగ సాంకేతికతలు ప్రారంభ దశలోనే ఉన్నాయి. ఇవి ఖరీదైనవి కావడంతో హైడ్రోజన్ ఉత్పత్తి ఖర్చు ఎక్కువగా ఉంటోంది. 3) ప్లాంటు పూర్తయిన తర్వాత ఇంధన కణాల నిర్వహణ ఖర్చులు దక్షిణ కొరియాలో మాదిరిగా ఖరీదైనవి కావచ్చు. 4) హైడ్రోజన్‌ను ఇంధనంగా, పరిశ్రమల్లో వాణిజ్యపరంగా ఉపయోగించాలంటే అలాంటి సాంకేతిక పరిజ్ఞానంపై పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ)లో, హైడ్రోజన్ ఉత్పత్తి, నిల్వ, రవాణా, డిమాండ్ సృష్టికి తగిన మౌలిక సదుపాయాల కల్పనకు భారీ పెట్టుబడులు అవసరం.

గ్రీన్ హైడ్రోజన్: నీటిని విద్యుత్తు విశ్లేషణకు గురిచేసి గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయవచ్చు. ఈ ప్రక్రియలో నీటిఅణువు.. హైడ్రోజన్, ఆక్సిజన్‌గా విభజన చెందుతుంది. అంటే ఇందులో ఉపఉత్పన్నంగా వాతావరణంలోకి ఆక్సిజన్ విడుదలవుతుంది. ఈ ప్రక్రియను పవన విద్యుత్తు లేదా సౌర విద్యుత్తుతో నిర్వహిస్తారు. ఫలితంగా కార్బన్‌డయాక్సైడ్ విడుదల జరగదు. అందుకే ఈ ఎంపిక శుద్ధమైనది.

* ప్రస్తుతం వాడుకలో ఉన్న హైడ్రోజన్‌ను రసాయన ప్రక్రియల ద్వారా శిలాజ ఇంధనాలు, బయోమాస్‌ను ఉపయోగించి ఉత్పత్తి చేస్తున్నారు. ఇందులో వాతావరణంలోకి ఎలాంటి కర్బన ఉద్గారాలు విడుదల కావు.

గ్రీన్ హైడ్రోజన్ ప్రాధాన్యం: గ్రీన్‌హౌస్ ఉద్గారాల తగ్గింపుపై 'ఉద్దేశిత జాతీయ నిర్ణాయక భాగస్వామ్యం' (INDC) లక్ష్యాలను సాధించేందుకు గ్రీన్ హైడ్రోజన్ ఉపయోగపడుతుంది. ఈ ఇంధనాన్ని రైల్వేలు, పెద్ద ఓడలు, బస్సులు లేదా ట్రక్కులు లాంటివాటిలో ఉపయోగించవచ్చు. అలాగే గ్రీన్ హైడ్రోజన్‌ను 10% వరకు ఇంధన సరఫరాలో కలపడం ద్వారా విస్తృత ఆమోదం పొందవచ్చు.

గ్రీన్ హైడ్రోజన్ ఉపయోగించడం వల్ల ప్రయోజనం: * ఇది స్వచ్ఛ దహన పరమాణువు. ఇనుము- ఉక్కు పరిశ్రమ, రసాయన పరిశ్రమలు, రవాణా సహా అనేక రంగాలను కర్బన ఉద్గార రహితం చేయగలుగుతుంది. * గ్రిడ్ ద్వారా నిల్వ చేయలేని లేదా ఉపయోగించలేని పునరుత్పాదక శక్తిని హైడ్రోజన్ ఉత్పత్తి కోసం మళ్లించవచ్చు.

మిషన్ 2030 లక్ష్యాలు: * 'భారత్ నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్' ప్రకారం దేశంలో 2030 నాటికి దాదాపు 125 GW అనుబంధ పునరుత్పాదక శక్తి సామర్థ్యంతో పాటు సంవత్సరానికి కనీసం 5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం. * ఈ రంగంలో మొత్తం రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, 6 లక్షల ఉద్యోగాల కల్పించడం. * శిలాజ ఇంధన దిగుమతుల వ్యయాన్ని రూ.లక్ష కోట్లు మేర తగ్గించడం. * దాదాపు 5 మిలియన్ మెట్రిక్ టన్నుల వార్షిక గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల తగ్గింపు.

హైడ్రోజన్ రకాలు: ఉత్పత్తి ప్రక్రియ ఆధారంగా హైడ్రోజన్‌ను గ్రీన్ హైడ్రోజన్, పింక్ హైడ్రోజన్, బ్లూ హైడ్రోజన్, గ్రే హైడ్రోజన్, ఎల్లో హైడ్రోజన్‌లుగా వర్గీకరించవచ్చు.

పింక్ హైడ్రోజన్: గ్రీన్ హైడ్రోజన్ మాదిరిగానే పింక్ హైడ్రోజన్ కూడా విద్యుద్విశ్లేషణతో నీటిని విభజించడంతో తయారవుతుంది. అయితే ఇందులో అణుశక్తిని శక్తి వనరుగా ఉపయోగిస్తారు.

బ్లూ హైడ్రోజన్: స్టీమ్ మీథేన్ రీఫార్మింగ్ లేదా ఆటోథర్మల్ రిఫార్మింగ్ ద్వారా సహజవాయువును విభజిస్తే హైడ్రోజన్, CO_2 ఏర్పడతాయి. ఇలా ఏర్పడిన CO_2ని కూడా సంగ్రహించి నిల్వ చేస్తారు.
నోట్: సహజవాయువులో అత్యధికంగా మీథేన్ ఉంటుంది.

గ్రే హైడ్రోజన్: ఈ ప్రక్రియ దాదాపు బ్లూ హైడ్రోజన్ మాదిరిగానే సహజ వాయువును హైడ్రోజన్, CO_2గా విభజించడానికి ఉపయోగిస్తారు. కానీ CO_2 సంగ్రహణతోపాటు వాతావరణంలోకి విడుదలవుతుంది. ఈ విధానం చాలా ఏళ్లుగా ఆచరణలో ఉంది.

ఎల్లో హైడ్రోజన్: గ్రీన్ హైడ్రోజన్ మాదిరిగానే నీటిని విద్యుత్తు విశ్లేషణ చేసి ఎల్లో హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తారు. అయితే ఇందులో పూర్తిగా సౌర విద్యుత్తును వినియోగిస్తారు.


రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ

మాకవరపాలెం, నాతవరం, న్యూస్‌టుడే: మాకవరపాలెం ఇన్‌ఛార్జి తహసీల్దారుగా లోకారపు రామారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఎం.వి.వి.ప్రసాదరావు బదిలీ అయ్యారు. దీంతో నర్సీపట్నం తహసీల్దారు రామారావుకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. తెదేపా నాయకులు అల్లు రామునాయుడు, నండకిషోర్, వెంకటగిరి, శ్రీను తదితరులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాతవరం తహసీల్దారుగా వేణుగోపాల్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన అనకాపల్లి నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. తెదేపా మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, నాయకులు కరక సత్యనారాయణ, మాజీ ఎంపీపీలు కొండబాబు, విజయకుమార్, సన్యాసిదేముడు పలువురు నేతలు తహసీల్దారును కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం సర్వేయర్లతో తొలిగా సమావేశం నిర్వహించారు.



పాతాళ భైరవిలో ఓ సన్నివేశం

జుత్తాడలో సురభి నాటక ప్రదర్శనలు

చోడవరం: పౌరాణిక ఇతివృత్తాలను అద్భుతమైన సెట్టింగులతో కమనీయంగా ప్రదర్శించే ఘనత సురభి నాటక సంస్థదేనని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు అన్నారు. జుత్తాడ గ్రామంలో దేవీ నవరాత్రులను పురస్కరించుకుని సురభి నాటకాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలను ఎమ్మెల్యే రాజు ప్రారంభించారు. భక్తప్రహ్లాద, పాతాళ భైరవి నాటకాలను ప్రదర్శించారు. శుక్రవారం మాయాబజార్ నాటక ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి సన్యాసిరావు, జుత్తాడ పెద్దలు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆదీ: **సత్యం సుందరం, వెట్టయన్** ఆదీ: **శ్వాగ్** ఆదీ: **దేవర**, ఆదీ: **వెట్టయన్** రాజా: **వెట్టయన్**, బంగార్రాజు: **దేవర**

చోడవరం: శ్రీసాయిలక్ష్మి: **వెట్టయన్** సాయిలక్ష్మి: **శ్వాగ్**, పూర్ణ: **దేవర**

14, 18న పల్లెపండగ

కె.కోటపాడు, న్యూస్‌టుడే: కె.కోటపాడు మండలంలో పల్లెపండగ కార్యక్రమాలు ఈనెల 14, 18 తేదీల్లో జరుగుతాయని ఎంపీడీఓ అప్పలనాయుడు తెలిపారు. 14న సింగందొరపాలెం, కె.జె.పురం, ఎ.కోడూరు, రామయోగి అగ్రహారం, పోతనవలస, కొరువాడ గ్రామాల్లో... 18న పైడమ్మపేట, రొంగలినాయుడుపాలెం, గొండుపాలెం, చౌడువాడలో కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆయా గ్రామాల్లో 49 అభివృద్ధి పనులకు రూ. 6.06 కోట్లు, సీసీ రోడ్లు డ్రెయిన్ల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ పనులను మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభిస్తారన్నారు.

నిరుపేదలకు నిత్యావసరాల వితరణ

కె.కోటపాడు, న్యూస్‌టుడే: కె.కోటపాడు కామక్షమ్మ ఆలయం వద్ద గురువారం ఒక నెలకు సరిపడా నిత్యావసర సరకుల కిట్లను సత్యసాయి భక్తులు నిరుపేదలకు ఉచితంగా అందజేశారు. దసరా కానుకగా ఈ సరకులను బండారు నారాయణపాత్రుడు చేతులమీదుగా అందించారు.



సరకులు అందిస్తున్న సత్యసాయి భక్తులు

వరిలో తెగుళ్ల నివారణకు చర్యలు

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రస్తుతం పిలకలు పెట్టేదశ, చిరుపొట్ట దశలో ఉన్న వరిపంటపై పాముపొడ తెగులు, ఆకు ముడత పురుగు, పొటాష్‌లోపం గుర్తించినట్లు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీదేవి తెలిపారు. పాముపొడ గమనిస్తే గట్లపై కలుపు నిర్మూలించుకోవాలని, వ్యవసాయ సిబ్బంది సలహాలను అనుసరించి మందు పిచికారీ చేసుకోవాలని సూచించారు. తెగులు ఉద్ధృతి ఉంటే ప్రొపికొనజోల్ ఒక మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఆకుముడత నివారణకు పిలక దశలో చేనుకు అడ్డంగా తాడు లేదా కంప లాక్కోవాలని ఆమె సూచించారు.



వరిలో తెగుళ్లను పరిశీలిస్తున్నఏడీఏ శ్రీదేవి

కొండంత చెత్త.. కదిలింది కొంత

దంపింగ్‌యార్డు ఖాళీకి చర్యలు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే

నర్సీపట్నం పురపాలక సంఘం పరిధిలో టన్నుల కొద్దీ పేరుకుపోయిన వ్యర్థాల గుట్టకు ఎట్టకేలకు మోక్షం లభిస్తోంది. ఇక్కడ నిల్వ ఉన్న పొడి చెత్తని టిప్పర్ ద్వారా విశాఖ నగరం కాపులుప్పాడలోని పవర్‌ప్లాంట్‌కు తరలించే పనులు బుధవారం ప్రారంభం కావడం తెలిసిందే. గురువారం మూడు టిప్పర్లను ఇందుకోసం వినియోగించారు. కొద్దికాలంగా ఇక్కడ దాదాపు వంద మెట్రిక్ టన్నుల పొడిచెత్త గుట్టగా పేరుకుపోయింది. పట్టణంలో ప్రస్తుతం రోజువారీ సేకరిస్తున్న వ్యర్థాలు వేయడానికి అవసరమైన ప్రదేశం అందుబాటులో లేకుండాపోయింది. దీన్ని అత్యవసరంగా తరలించాల్సిన అవసరాన్ని కమిషనర్ సురేంద్ర ఇటీవల సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన సూచనలకు అనుగుణంగా ఇప్పుడు టిప్పర్ల ద్వారా కాపులుప్పాడ పంపిస్తున్నారు. ఒక్కో టిప్పరుకు ఏడున్నర టన్నుల వరకు పొడి చెత్త వేస్తున్నారు. తరలింపునకు తొలి విడతగా ఆరు లక్షల రూపాయల వరకు వెచ్చించాలని నిర్ణయించినట్టు కమిషనర్ సురేంద్ర 'న్యూస్‌టుడే'కి తెలిపారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ సురేంద్ర



దాదాపు ఎనిమిది ఏళ్లుగా పేరుకుపోయిన వ్యర్థాల గుట్ట

బలిఘట్టంలోని వరాహ నది ఒడ్డున ఐదెకరాల స్థలంలో 2017లో రూ. 1.15 కోట్ల ఖర్చుతో ఘన-వ్యర్థాల నిర్వహణ పార్కు ఏర్పాటుచేశారు. తడి-పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి తడి చెత్తతో ఎరువు తయారు చేయాలని, పొడిచెత్తలోని ప్లాస్టిక్, ఇనుము, తోలు, ఇనుము తదితర రకాలను వేరు చేసి ఆదాయ వనరుగా మార్చుకోవాలని మార్గదర్శకాలు ఉన్నాయి. కొన్నాళ్లపాటు పట్టణంలో ఇళ్ల నుంచి తడి-పొడి వేర్వేరుగా సేకరించినా డంపింగ్ యార్డుకు మాత్రం కలిపేసి పంపేవారు. ఇలా ఇక్కడ గడిచిన ఏడేళ్లలో దాదాపు 500 మెట్రిక్ టన్నుల వరకు వ్యర్థాలు పేరుకుపోయాయి. దీనిని గుట్టగా వదిలేశారు. దీన్నిప్పుడు సాంకేతిక పరిజ్ఞానంతో ధ్వంసం చేయించాలని నిర్ణయించారు. ఈ పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచారు. టెండర్లు ఖరారైతే ఇక్కడి చెత్త గుట్టకు మోక్షం లభించినట్టే. పెదబొడ్డేపల్లి పెద్దచెరువులోనూ వందల టన్నులు నిల్వ ఉంది. దీన్ని తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. బలిఘట్టం డంపింగ్‌యార్డులో తరలింపు పూర్తయ్యాక ఖాళీ అయిన ప్రదేశంలో మళ్లీ చెత్త వేయనున్నారు. ఐదారేళ్లపాటు చెత్త నిల్వకు ఇబ్బంది ఉండదని అధికారులు భావిస్తున్నారు. డంపింగ్ యార్డు ఖాళీ చేసే కార్యక్రమాలు చేపడుతున్నందున ఈ పనులు పూర్తి కాగానే ఘన-వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాలు పక్కాగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

70 వేలకు పైగా జనాభా కలిగిన నర్సీపట్నంలో రోజుకు 30 టన్నుల వరకు చెత్త సమకూరుతోంది. ప్రణాళిక ప్రకారం వ్యవహరిస్తే ఈ వ్యర్థాల నుంచి సంపద సృష్టించేందుకు వీలుంటుంది. స్వచ్ఛ నర్సీపట్నం సాకారం చేసేందుకు అధికారులు ప్రత్యేకంగా శ్రద్ధ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

కాకినాడ ఇసుక... నర్సీపట్నంలో విక్రయం!



పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక టిప్పర్లు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా యర్రవరం గెడ్డలో అక్రమంగా తవ్విన ఇసుక టిప్పర్లతో రోజూ నర్సీపట్నం తరలివస్తోంది. నిత్యం నాలుగైదు టిప్పర్లు బలిఘట్టంలోని తలుపులమ్మ గుడిపక్క ఖాళీ ఆవరణలో, ఎదుటి ఖాళీస్థలంలో ఉంచుతున్నారు. కావాల్సిన వారికి నేరుగా తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. నాతవరం మండలానికి కొందరు కాకినాడలోని ఇసుక అక్రమార్కులు, స్థానిక కొనుగోలుదారులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారని సమాచారం. కొద్దిరోజులుగా నిత్యం జాతరలా టిప్పర్లు రావడం గమనించిన స్థానికులు గురువారం ఉదయం పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లి రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం జరిమానా విధించి ఆ వాహనాలను వదిలిపెట్టారు. నిత్యం పొరుగు జిల్లా నుంచి అనకాపల్లి జిల్లాలో రెండు పోలీసుస్టేషన్ల పరిధి దాటి టిప్పర్లు వస్తున్నా స్థానికులు సమాచారం ఇచ్చేవరకు అధికారుల దృష్టికి రాకపోవడం గమనార్హం.

కోనాం సంతకు దసరా కళ



కోనాం సంతలో విక్రయిస్తున్న మేకలు, గొర్రెలు

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలం కోనాంలో గురువారం జరిగిన గిరిజన వారపు సంతకు దసరా కళ వచ్చింది. దసరా ముందువారం సంత కావడంతో జనాలతో కిక్కిరిసింది. సంతలో నాటుకోళ్లు, మేకలు, గొర్రెల విక్రయాలు జరిగాయి. మరోవైపు దుస్తుల దుకాణాల్లో కొనుగోళ్లు భారీగా జరిగాయి.

ఊరూరా వేడుకలు.. దుర్గమ్మకు వేవేల దండాలు



నర్సీపట్నం గచ్చపువీధి నుంచి సారె తీసుకొస్తున్న భక్తులు



నర్సీపట్నంలో..



సీతయ్యపేటలో..



నాతవరంలో..



చోడవరంలో..



అడవి అగ్రహారంలో దుర్గమ్మకు సారె ఊరేగింపు



ఎం.కోడూరులో..



దేవరాపల్లిలో దుర్గాదేవి అమ్మవారి ముందు దీపారాధన

దేవరాపల్లి, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక చింతనలో ఓలలాడుతున్నాయి. దేవరాపల్లి ఆటో యూనియన్ సభ్యులు ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కుమారుడు అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు. ఆటో యూనియన్ నాయకులు సందారపు ఈశ్వరరావు, శంకరరావు, వెంకటరావు వీరిని సత్కరించారు. బోయిలకింతాడలో జరిగిన అన్నసమారాధనలో మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, సర్పంచి బూరె బాబూరావు తదితరులు పాల్గొన్నారు. దేవరాపల్లి వీరకపేటలో, వెంకటేశ్వర స్వామి ఆలయంలో అంజులం పూజ జరిగింది.

బుచ్చెయ్యపేట, రావికమతం: సీతయ్యపేట దుర్గామల్లేశ్వర ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం తిరువీధి ఉత్సవం నిర్వహించారు. టి.అర్జాపురంలో దుర్గాదేవి విగ్రహాన్ని గాజులతో అలంకరించారు.

చీడికాడ: అప్పలరాజుపురం మెట్టపై లలితాదేవి దుర్గాదేవి అవతారంలో దర్శనం ఇచ్చారు. అడవి అగ్రహారంలో అమ్మవారికి సారె ఊరేగింపు సంప్రదాయకంగా నిర్వహించారు. బైలపూడి, బి.సింగవరం గ్రామాల్లో భారీ అన్న సమారాధనలు నిర్వహించారు.

నర్సీపట్నం/అర్బన్, నాతవరం, న్యూస్‌టుడే: నర్సీపట్నం దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో సహస్రనామార్చన, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. గచ్చపువీధి రామాలయం శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు పిండివంటలతో మేళతాళాలతో పలు ఆలయాలను సందర్శించారు. బలిఘట్టం వరాహనది ఒడ్డునగల దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో ఉదయం చండీపారాయణ, కుంకుమ పూజలు, సాయంత్రం దుర్గా హోమం నిర్వహించారు. వేములపూడి ఆలయంలో సాయంత్రం అన్న సమారాధన నిర్వహించారు. నాతవరం శక్తి పంచాయతన ఆలయంలో కుంకుమ పూజ చేశారు.

రోలుగుంట, దేవరాపల్లి: కొంతలంలో 101 బిందెలతో గ్రామస్థులు అమ్మవారికి జలాభిషేకం చేశారు. దేవరాపల్లి మండలం ఎన్.గజపతినగరం శివారు వడ్డాదిపాలెంలో అన్నదానం జరిగింది. జనసేన మండలశాఖ అధ్యక్షుడు గొర్రుపోటు రామ్మూర్తినాయుడు హాజరై నిర్వాహకులకు రూ. 5116 విరాళంగా అందజేశారు.

మాడుగుల గ్రామీణం: ఎం.కోడూరులో భవానీలు, గ్రామస్థులు దుర్గాదేవికి సారె ఊరేగింపు నిర్వహించారు. విశ్వనాధం పారిశ్రామిక మండల కమిటీ అధ్యక్షులు రాపేటి రామకొండలరావు మాస్టారు, కార్యదర్శి పెట్టేటి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణదేవిపేట: కొత్తమల్లంపేటలో అన్న సమారాధన చేపట్టారు. చెరువ్యూపాలెంలో దుర్గాదేవి భక్తులు నిండువడలతో ఊరంతా ప్రదర్శన నిర్వహించారు.



గర్నికంలో ఘటాలతో దుర్గాదేవి గుడికి తరలివెళ్తున్న భవానీలు

దుర్గాదేవి సన్నిధిలో బాల బేతాళుడు



చోడవరంలో దుర్గాదేవి వద్ద బాల బేతాళుడు

చోడవరం, న్యూస్‌టుడే: విజయదశమిని పురస్కరించుకుని ఆలయంలో దుర్గాదేవి విగ్రహం వద్ద బాల బేతాళుడిగా తమ పిల్లలను ఉంచేందుకు తల్లిదండ్రులు పోటీ పడుతుంటారు. దేవీ నవరాత్రుల సమయంలో ఈ దీక్షతో ఉంటే జీవితంలో చక్కగా స్థిర పడతామే కాకుండా ప్రభుత్వ కొలువు వస్తుందన్నది స్థానికుల ప్రగాఢ విశ్వాసం. దేవీ నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా పంచ రాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ అయిదు రోజులు దీక్షలో బాలుడు ఆలయంలోనే గడపాలి. ఉత్సవాల ముగింపు రోజున దీక్ష విరమిస్తారు. ఈ ఏడాది చోడవరం పాతబస్టాండ్ దరి దుర్గాదేవీ ఆలయంలో పోతుగంటి సాయి ఈశ్వర్ కొత్త బాల బేతాళుడి దీక్ష చేపట్టాడు. ఈ విషయమై ఆలయ ప్రధాన అర్చకులు శివ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ గతంలో బాల బేతాళుడుగా ఉన్న పిల్లలు ప్రభుత్వ ఉద్యోగాలు రావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఆలయంలో బాల బేతాళుడుగా ఉంచమని కోరుతారని శివ చెప్పారు. గత నాలుగు దశాబ్దాలుగా చోడవరంలో మోటారు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రుల మహోత్సవాలు జరుగుతున్నాయి. గురువారం అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743
చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74737

కె.కోటపాడు, న్యూస్‌టుడే

?: గుల్లిపల్లిలో సామాజిక భవనం స్థానిక అవసరాలకు సరిపోవడం లేదు. దాని స్థానంలో నూతన భవనం నిర్మించాలి.
– నాయుడు, గుల్లిపల్లి

✓: భవనాన్ని పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం.
– బండారు బాలాజీ అప్పారావు, ఏఈ

చోడవరం, న్యూస్‌టుడే

?: సింహాద్రిపురం నుంచి లక్కవరం వెళ్లే రహదారికి ఇరువైపులా తుప్పలు పెరిగాయి. రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నాం. – కొట్యాడ స్వామి, సింహాద్రిపురం

✓: తుప్పల తొలగింపునకు చర్యలు చేపడతాం. – ఆర్అండ్‌బీ కార్యాలయ సిబ్బంది

శుభ్రత ప్రజలందరి బాధ్యత



వేములపూడిలో పరిసరాలను శుభ్రం చేస్తున్న మహిళలు

మాకవరపాలెం, నర్సీపట్నం గ్రామీణం, గొలుగొండ, కె.కోటపాడు, న్యూస్‌టుడే: ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండేందుకు వీధులు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని మాకవరపాలెం మండల ప్రత్యేకాధికారి మనోరమ అన్నారు. మాకవరపాలెం బీసీ కాలనీలో గురువారం స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో ఆమె పాల్గొని ఆశ కార్యకర్తలతో కలసి చెత్త చెదారాలను శుభ్రం చేశారు. పందులను వీధుల్లోకి వదిలేస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల పరిషత్తు కార్యాలయం పాలనాధికారి, పంచాయతీ కార్యదర్శి బాలదొర, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు. వేములపూడిలో పొదుపు సంఘాల మహిళలు, అంగన్‌వాడీ ఉద్యోగులు, పంచాయతీల కార్యదర్శులు, పారిశుద్ధ్య సిబ్బంది వారపు సంత ప్రాంతంలో వ్యర్థాలను తొలగించి డంపింగ్‌యార్డుకు తరలించారు. స్థానికులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ ఉషశ్రీ, కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ, సర్పంచి నూకాలమ్మ తదితరులు పాల్గొన్నారు. గొలుగొండలో ఎంపీడీఓ సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వచ్ఛతే సేవ కార్యక్రమం నిర్వహించారు. రద్దీ ప్రదేశాల్లో తుప్పలతోపాటు చెత్తను తొలగించారు. కె.కోటపాడు వీధుల్లో చెత్తచెదారాన్ని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, ఎంపీడీఓ సాంబశివరావు తదితరులు శుభ్రం చేయించారు.

రావికమతం: కొత్తకోటలో సర్పంచి కోన లోవరాజు, ఉప సర్పంచి పందల దేవా, కార్యనిర్వహణాధికారి జ్యోతిరెడ్డి పంచాయతీ, సచివాలయం ఉద్యోగులతో కలిసి శ్రమదానం చేశారు. సహకార సంఘం నుంచి ఉన్నత పాఠశాల వరకు చీపుళ్లతో శుభ్రం చేశారు. రోజుకో వీధిలో పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నట్టు సర్పంచి లోవరాజు తెలిపారు.

దేవరాపల్లి, న్యూస్‌టుడే: దేవరాపల్లిలో మండల ప్రత్యేకాధికారి రవీంద్రనాథ్, ఎంపీడీఓ సువర్ణరాజు తదితరులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సమాజం మొత్తం బాగుంటుందన్నారు.

మన ఊరును పరిశుభ్రంగా ఉంచుదాం..



తుప్పలు తొలగిస్తున్న ఎమ్మెల్యే రాజు, అధికారులు

చోడవరం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ తమ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలనే భావన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. పరిసరాలు బాగుంటే ఆరోగ్యకర వాతావరణం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. స్వచ్ఛతే సేవలో భాగంగా గురువారం పట్టణంలోని సీతారామయ్య పార్కులో సామూహిక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజు పాల్గొని స్వయంగా పనికిరాని తుప్పలు తొలగించారు. పార్కులను వినియోగంలోకి తెచ్చి ఆహ్లాదకర వాతావరణం పట్టణ వాసులకు కలిగేలా చేయడంలో పంచాయతీ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారిణి, బీసీ కార్పొరేషన్ ఈడీ డి.రాజేశ్వరి, ఎంపీడీవో పీవీఎస్ఎన్ ఆంజనేయులు, ఈవోఆర్డీ వర్రి మహేష్, పంచాయతీ కార్యదర్శి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

తాతయ్యబాబుకు పలువురి అభినందనలు



తాతయ్యబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

నర్సీపట్నం గ్రామీణం, దేవరాపల్లి, రోలుగుంట, న్యూస్‌టుడే: రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించిన బత్తుల తాతయ్యబాబుకు దేవరాపల్లి మండల తెదేపా అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. స్థానిక నాయకులు రెడ్డి సురేష్, కొమార బాబూరావు, వెంకటరావు, పోతల రమణమ్మ తదితరులున్నారు. తెలుగుమహిళ జిల్లా అధ్యక్షురాలు ఎ.అమ్మాజీ, ప్రధాన కార్యదర్శి ఎస్.రమణమ్మ, ఉపాధ్యక్షులు పి.రత్నకుమారి, విజయవాడలో కంగా కలిసి అభినందనలు తెలిపారు. రోలుగంట తెదేపా నాయకులు చంద్రమౌళి, బుల్లిబాబు, పంచాడ చంద్ర, కోలుపల్లి ఈశ్వరరావు, రమేష్ హర్షం ప్రకటించారు.

మానసిక ఒత్తిడి ప్రమాదకరం



గొలుగొండ పీహెచ్‌సీ వద్ద ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గొలుగొండ: మానసిక ఒత్తిడి ఎక్కువైతే జీవితం నరకప్రాయం అవుతుందని వైద్యాధికారి శ్యామ్‌కుమార్ అన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రం వద్ద మానసిక ఒత్తిడిని అధిగమించడం ఎలా అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. మనసును ప్రశాంతంగా ఉంచుకుంటే రుగ్మతలు దరిచేరవని సూచించారు.

మాడుగుల గ్రామీణం, రావికమతం: మాడుగుల ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం మానసిక ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. చోడవరం బార్ ఉపాధ్యక్షుడు శ్రీనాథు ప్రసాదరావు మాట్లాడుతూ కుటుంబ సభ్యులు, స్నేహితులు, చుట్టుపక్కల వారితో కలిసిమెలసి ఉండాలన్నారు. డాక్టర్ ఎల్.శ్రీనివాసరావు పాల్గొన్నారు. కొత్తకోట ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి రజని మాట్లాడారు.

చోడవరం: ప్రభుత్వ ఆసుపత్రిలో మండల న్యాయసేవాధికార సంస్థ అధ్వర్యంలో మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. వైద్యులు డా.ఎల్.వినయ్‌కుమార్, న్యాయవాదులు కొలగాని సతీష్ భూపతిరాజు, జి.వి.పి.రాజు, వైద్యులు దినేష్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గెడ్డ ఆక్రమణలపై సర్వే



పెద్దచెరువు గెడ్డ ప్రాంతం పరిశీలిస్తున్న రెవెన్యూ, జలవనరులశాఖ అధికారులు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నర్సీపట్నం పెద్దచెరువు పొర్లుకట్ట నుంచి ధర్మసాగరం పెద్దచెరువుకు నీరెళ్లే గెడ్డ పొడవునా ఆక్రమణల గుర్తింపునకు గురువారం జలవనరులు-రెవెన్యూ శాఖల సిబ్బంది శ్రీకారం చుట్టారు. తొలిరోజు కిలోమీటరున్నర వరకు పరిశీలించారు. గెడ్డ వాస్తవ విస్తీర్ణమెంత, ప్రస్తుతం క్షేత్ర పరిస్థితి ఏమిటన్నది పరిశీలించారు. ఆక్రమణలపై కొంత మంది రైతులు ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. కొద్దిరోజుల క్రితం భారీ వర్షాలకు గెడ్డ పొంగి రోడ్లను, పంటలను పలుచోట్ల ముంచెత్తింది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఈ సర్వే చేపట్టారు. సర్వే పూర్తయిన అనంతరం ఎక్కడెంత ఆక్రమణ జరిగిందో నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తారు. తదుపరి ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపట్టనున్నారు. జలవనరుల శాఖ ఏఈఈ రామన్నపాత్రుడు, సర్వేయర్ బరటం వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో పరిశీలన జరిగింది.

గిరిజనుల కష్టాలంటే లెక్క లేదా?



కట్టెల వంతెనను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: గిరిజనుల సమస్యలంటే ప్రభుత్వానికి లెక్కలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి, మండల నాయకులు కె.భవాని విమర్శించారు. తాటిపర్తి పంచాయతీ అజేయపురం గ్రామాన్ని గురువారం వారు సందర్శించి స్థానికుల కష్టాలపై ఆరాతీశారు. తాటిపర్తి నుంచి అజేయపురం గ్రామానికి వెళ్లే రోడ్డు మధ్యలో గెడ్డ దాటడానికి గిరిజనులే కష్టపడి కట్టెలతో వంతెన నిర్మించుకున్నారని తెలిపారు. గిరిజనులు శ్రమదానం చేసి కాలిబాటను ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. ఊటనీటినే తాగడానికి ఉపయోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా మంది గిరిజనులకు రేషన్ కార్డులు, ఆధార్, భూపట్టాలు, ఇళ్లు లేవన్నారు. మండల కేంద్రానికి కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలోనే ఉన్న ఈ గ్రామానికి మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని మండిపడ్డారు. కలెక్టర్ గ్రామాన్ని సందర్శించి సత్వరమే గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

చిననందిపల్లిలో రక్తదాన శిబిరానికి స్పందన

దేవరాపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని చిననందిపల్లిలో బెస్ట్ ఫ్రెండ్స్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరం, ఉచిత మెగా వైద్య శిబిరంతో పాటు అవయవదాన అవగాహన కార్యక్రమానికి స్పందన లభించింది. రోటరీ బ్లడ్ బ్యాంకు, మెడికవర్ ఆసుపత్రి సహకారంతో వీటిని నిర్వహించారు. 55 మంది రక్తదానం చెయ్యగా, 51 మంది అవయవ దానం చెయ్యడానికి అంగీకారం తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చిన 850 మంది రోగులకు వైద్యులు అశోక్ కుమార్, వై.శ్రావణి, ఎస్.జె.సాయిచందు సేవలందించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ట్రస్టు వ్యవస్థాపకులు పి.ఎస్.బాబు, ఛైర్మన్ పల్లా సూరిబాబు, వైస్ ఛైర్మన్ పి.సంతోష్ రాజా, ప్రెసిడెంట్ కె.శివ, కార్యదర్శి పి.వెంకటరావు నిర్వహించారు. మాజీ సర్పంచి పూడి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
ప్లెక్స్-1 - దేవర
ప్లెక్స్-2 - శ్వాగ్

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ విజేత విశాఖ

నంద్యాల: నంద్యాల జిల్లా చాగలమర్రి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన 53వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విజేతగా వైజాగ్ జట్టు నిలిచింది. గురువారం నిర్వహించిన ఫైనల్లో పశ్చిమగోదావరిపై విశాఖ మూడు పాయింట్ల ఆధిక్యంతో గెలుపొందింది.


గెలుపొందిన విశాఖ జట్టు

పెందుర్తి

వైభవంగా నేస్తాలమ్మ పండగ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ వాడచీపురుపల్లి, నాయుడుపాలెం పంచాయతీ ప్రజల ఆరాధ్య దేవత నేస్తాలమ్మ అమ్మవారి పండగను గురువారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారి దర్శనానికి ఉదయం నుంచే బారులు తీరారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి అనుపోత్సవం చేశారు.



మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM

పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

– న్యూస్‌టుడే, సబ్బవరం

సమస్య: పాతసబ్బవరంలో కాలువ లేకపోవడంతో మురుగంతా వాటర్ ట్యాంకు సమీపంలో నిలిచిపోతోంది. దోమలు, ఈగలు పెరిగిపోతున్నాయి. స్థానికులు తరచూ జ్వరాల బారిన పడుతున్నారు.


– జి.అప్పలనాయుడు, పాతసబ్బవరం

సమాధానం: పంచాయతీ కార్యదర్శి సమావేశంలో చర్చించి కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

– డి.ప్రసాదరావు, సర్పంచి సబ్బవరం

పండగ వేళ.. ధరల దడ

★ భారీగా పెరిగిన కూరగాయల రేట్లు
★ ఉక్కిరిబిక్కిరవుతున్న వినియోగదారులు



పెందుర్తి, న్యూస్‌టుడే: అరకొర ఆదాయం.. అపరిమిత వ్యయంతో అవస్థలు పడుతున్న సగటు జీవికి కూరగాయల ధరలు కొరకని కొయ్యలా మారాయి. రోజురోజుకూ ఆకాశాన్నంటుతున్న ధరలను చూసి వినియోగదారులు భయపడాల్సిన పరిస్థితి. రైతుబజార్లలోనే రేట్లు కొండెక్కి కూర్చుంటే.. బయట మార్కెట్ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు. ఏ కూరగాయ ధరలు చూసినా కిలోకు కనీసం రూ.50 ఖర్చు చేయాల్సిన దుస్థితి. బయట విపణిలో వీటి రెట్టింపు ఉంటున్నాయి. దీంతో రైతుబజార్లకు కొనుగోలుదారులు బారులు తీరుతున్నారు.

కాలానుగుణ పంటలు పెరగాలి..

జిల్లాలో కాలానుగుణంగా పండించే కూరగాయల పంటలు పెరిగితే ధరలు కొంతమేర తగ్గే అవకాశం ఉందని మార్కెటింగ్ నిపుణులు చెబుతున్నారు. వరి పంట పండించే సమయం కావడంతో కూరగాయల సాగు తగ్గి డిమాండ్ పెరిగిందని పేర్కొంటున్నారు. రాబోయే రోజుల్లో కాయగూరల సాగును ప్రభుత్వం మరింత ప్రోత్సహించి సరఫరాను పెంచకపోతే పరిస్థితి దారుణంగా మారుతుందని పేర్కొంటున్నారు.

మరి కొన్నాళ్లు ఇదే పరిస్థితి..

మరికొన్నాళ్లు కూరగాయల ధరలు ఇలాగే కొనసాగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. స్థానికంగా పంటలు తగ్గిపోవడంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న కూరగాయలు ఇతర జిల్లాలకు తరలిపోతున్నాయని చెబుతున్నారు. దీంతో కొన్నిరకాల కూరగాయలు దొరకని పరిస్థితి. వచ్చే కార్తిక మాసంలో అధిక జనాభా మాంసాహారం తీసుకోని నేపథ్యంలో కూరగాయల వినియోగం మరింత పెరుగుతుంది. ధరలు ఇలాగే కొనసాగితే సగటు జీవికి ఆర్థిక భారం మరింత పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు.

పెందుర్తి రైతుబజారులో ధరలు ఇలా...

కూరగాయలు	గత నెల 10న ధరలు కిలో	గురువారం ధరలు కిలో
	రూపాయల్లో..	
టమాటా	30	50
గుత్తి వంకాయ	50	58
బీరకాయలు	42	52
దొండకాయలు	40	44
క్యారెట్	30	40
బంగాళదుంపలు	29	30
బరబాటి	42	50
దేముడు చిక్కుడు	64	74
కాకరకాయలు	30	44
ఆగాకర	98	100
మునగకాడలు	40	82

రైతుబజార్లో వంట నూనెల విక్రయాలు

పెందుర్తి, న్యూస్‌టుడే: బహిరంగ విపణిలో వంట నూనెల ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ద్వారా రైతుబజార్లలో నిర్ణీత ధరలకు వంట నూనెల విక్రయాలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా గురువారం సాయంత్రం నుంచి పెందుర్తి రైతుబజార్లో వంటనూనెల విక్రయాలు ప్రారంభించినట్లు ఎస్టేట్ అధికారి పద్మిని తెలిపారు. పామాయిల్ లీటర్ రూ.120, సన్‌ఫ్లవర్ ఆయిల్ కంపెనీల బట్టి రూ.128 నుంచి రూ.132 వరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. రాయితీపై టమాటాలు విక్రయాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కిలో రూ.50కు ప్రతి వినియోగదారుడికి రెండు కిలోలు చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు.


రాయితీ టమాటాకు బారులు


వినియోగదారులకు నూనె ప్యాకెట్లు అందిస్తున్న రైతుబజార్ ఈవో పద్మిని

కూడళ్లలో గుంతలు.. రాకపోకలకు అవస్థలు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండల పరిషత్, సబ్‌స్టేషన్ కూడళ్లలో రహదారి ధ్వంసమై భారీ గుంతలు పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లంకెలపాలెం, గాజువాక, అచ్యుతాపురం, ఎన్టీపీసీ, ఫార్మాసిటీ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. వర్షం పడితే గుంతల్లో నీరు చేరి పరిస్థితి మరింత దారుణంగా తయారవుతోందని చెబుతున్నారు. రోడ్డు అంచులు దెబ్బతినడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ద్విచక్రవాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంతలను పూడ్చాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


పరవాడ సబ్‌స్టేషన్ కూడలి సమీపంలో భారీ గుంతలు

అ వీ ఇ వీ

బీఆర్టీఎస్‌లో అప్రమత్తంగా ప్రయాణించండి

ప్రహ్లాదపురం(వేపగుంట), న్యూస్‌టుడే: బీఆర్టీఎస్ రహదారిలోని ప్రమాదకర ప్రదేశాల వద్ద వేగ నిరోధకాలను ఏర్పాటు చేశామని, ప్రయాణికులు అప్రమత్తంగా ఉంటూ రాకపోకలు సాగించాలని 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా, ట్రాఫిక్ ఏసీపీ నర్సింగరావు పేర్కొన్నారు. గోపాలపట్నం పెట్రోల్ బంక్ నుంచి పాతగోశాల కూడలి వరకు 8 చోట్ల ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా వేగ నిరోధకాలను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాలను గురువారం కార్పొరేటర్, ట్రాఫిక్ ఏసీపీ పర్యవేక్షించారు.

'మందకృష్ణ మాదిగ అరెస్టు సరికాదు'

సబ్బవరం, న్యూస్‌టుడే: ఎస్సీల రిజర్వేషన్ కోసం పోరాడుతున్న మందకృష్ణ మాదిగను తెలంగాణ ప్రభుత్వం అరెస్టు చేయడం సరికాదని అనకాపల్లి జిల్లా ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు గొట్టేటి [illegible] పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణను చేపట్టకుండా సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా తెలంగాణలో డీఎస్సీ ఉద్యోగాలను భర్తీ చేశారని ఆరోపించారు. దీనిపై హైదరాబాద్‌లో శాంతియుత నిరసన ర్యాలీ చేస్తున్న మందకృష్ణ మాదిగను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ఎస్సీల వర్గీకరణ పూర్తయ్యాకే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ కన్వీనర్ ఐ.గోపి, సబ్బవరం మండల కన్వీనర్ నీటిపల్లి గౌరీ, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మారేడుబూడి కోటి, జిల్లా ఉద్యోగుల సమాఖ్య సలహాదారు దువ్వ దుర్గాలు, జి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విప్లవ వీరుడు చేగువేరా

పరవాడ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై పోరాడి విప్లవ వీరుడిగా చేగువేరా నిలిచిపోయారని అనకాపల్లి జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. పరవాడలోని సంస్థ కార్యాలయంలో గురువారం చేగువేరా వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. చేగువేరాను యువత ఆదర్శంగా తీసుకుని ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వి.వి.శ్రీనివాసరావు, టి.మల్లేశ్వరరావు, దేవకిశోర్, రాంబాబు, నాగరాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి మండలం గుర్రమ్మపాలెం పారిశ్రామిక ప్రాంతంలోని ఓ ఎలక్ట్రికల్ సంస్థలో ఈ నెల 4న జరిగిన చోరీలో పన్నెండు మంది నిందితులను అరెస్టు చేసినట్లు నేర విభాగం ఏసీపీ వెంకటరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గుర్రమ్మపాలెంలోని జీఈ ఎలక్ట్రికల్స్ సంస్థలో సుమారు రూ.12 లక్షలు విలువ చేసే 880 కిలోల రాగి తీగలను ఈ నెల 4న అర్ధరాత్రి దుండగులు దోపిడీ చేశారు. యజమాని ఫిర్యాదు మేరకు పెందుర్తి నేర విభాగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా చినముషిడివాడ దరి ఏకలవ్య కాలనీ, గాజువాక ప్రాంతాలకు చెందిన చిత్తు కాగితాలు ఏరుకునే పన్నెండు మంది నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర తైక్వాండో పోటీల్లో పతకాలు


పతకాలు గెలుపొందిన క్రీడాకారులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: తిరుపతిలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్(ఎస్‌జీఎఫ్) తైక్వాండో పోటీల్లో నగరానికి చెందిన విద్యార్థులు పతకాలు గెలిచినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి దేముడుబాబు తెలిపారు. అండర్-17 బాల, బాలికల విభాగాల్లో వెంకట ధనుష్, వై.జ్యోత్స్న, బి.క్రిష్ణచైతన్య, మోహిత్, పి.జస్విక, అంజనిప్రియ, సుస్మిత, టి.మణికంఠ హిమాన్షు స్వర్ణ పతకాలు కైవసం చేసుకోగా బి.అమృతవర్షిణి, బి.లావణ్య, కె.ఉదయ్‌నిఖిల్, కె.ఆదిత్య, టి.శ్రీకర రోహిత్‌కుమార్, కె.ధనలక్ష్మి రజత పతకాలు, వి.యువరాజ్, ఎస్.గోవర్ధని, లావణ్య షా, తిమామస్సీన్స్, ఎం.గాయత్రి కాంస్య పతకాలు గెలుపొందారని పేర్కొన్నారు.

దుష్ట సంహారిణి.. దుర్గా స్వరూపిణి


సుజాతనగర్‌లో..


ఉత్తరాంధ్ర శబరిమల క్షేత్రంలో..


సప్తగిరినగర్‌లో ధనలక్ష్మి అవతారం


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా దంపతులు


కృష్ణానగర్‌లో..

దుష్టులను శిక్షించి.. శిష్టులను రక్షించే దుర్గా స్వరూపిణిగా జగన్మాత భక్తుల నీరాజనాలందుకున్నారు. నియోజకవర్గంలోని పలు ఆలయాలు, ఉత్సవ మండపాల ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం అమ్మవారు దుర్గాదేవిగా భక్తులను అనుగ్రహించారు. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు చేసి ప్రత్యేక నివేదనలు సమర్పించారు. ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు జరిపారు. పలుచోట్ల భారీ అన్నసమారాధనలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, పెందుర్తి, వేపగుంట, సబ్బవరం, పరవాడ


చింతలగ్రహారం కృష్ణాలయంలో..


సబ్బవరం దుర్గమాంబ సన్నిధిలో అన్నసమారాధనను ప్రారంభిస్తున్న సీఐ పిన్నింటి రమణ


ముత్యాలమ్మపాలెంలో..


బంగారమ్మపాలెంలో ఘటాల ఊరేగింపు


నాయుడుతోటలో..


ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రంలో సామూహిక కుంకుమ పూజలు


దుర్గానగర్‌లో..


వెన్నెలపాలెంలో అన్నసమారాధన ప్రారంభిస్తున్న మాడుగుల ఎమ్మెల్యే బండారు సతీమణి మాధవీలత


పెదతాడిలో..


మణిపురంలో..


దేవీపురంలో..


ఆరిపాకలో..


సుజాతనగర్ లక్ష్మీనరసయ్యమ్మ ఆటోస్టాండు ఆధ్వర్యంలో అన్నసమారాధన

సింహాద్రినాథుడికి స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడి సన్నిధిలో గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. ఆనవాయితీగా అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు భక్తులను వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.


ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు, పూజల్లో పాల్గొన్న భక్తులు

గ్రామాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

పరవాడ, న్యూస్‌టుడే: గ్రామాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచుకోవడానికి అందరూ సహకరించాలని పరవాడ ఎంపీడీవో శ్యామ్ సుందర్ పిలుపునిచ్చారు. మండలంలోని గొర్లెవానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో గురువారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీడీవో పాల్గొని మాట్లాడారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు దరి చేరవన్నారు. అనంతరం సచివాలయ, ఎన్ఆర్ఈజీఎస్, వెలుగు ఉద్యోగులు చీపుళ్లు చేతపట్టి కాలనీలోని రోడ్లను పరిసరాలను శుభ్రం చేశారు. ఈవోపీఆర్డీ కె.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.


రహదారులను శుభ్రం చేస్తున్న ఉద్యోగులు తదితరులు

ఉక్కులో బతుకమ్మ సంబరాలు

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-5), న్యూస్‌టుడే : ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం సీ భవన్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు సందడిగా సాగాయి. కార్యక్రమాన్ని ఉక్కు సీజీఎం (వర్క్స్) ఇన్‌ఛార్జి యు.శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో జీఎంలు రవిశేఖర్, నవీన్‌కుమార్, ఎన్.వీరేశం, ఎన్.కుమారస్వామి, మోహన్‌రావు, జి.ఆనంద్, బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఉక్కు సీజీఎం (వర్క్స్) యు.శ్రీధర్, తదితరులు


ఫుట్‌బాల్ ఆడుతున్న వివిధ దేశాల నేవీ సిబ్బంది

నేవీ స్నేహపూర్వక క్రీడలు

సింధియా, న్యూస్‌టుడే : విశాఖ తీరంలో జరుగుతున్న మలబార్-2024 విన్యాసాల్లో భాగంగా గురువారం భారత్, జపాన్, అమెరికా, ఆస్ట్రేలియా నౌకాదళాల సిబ్బంది మధ్య స్నేహపూర్వక క్రీడలు జరిగాయని నేవీ వర్గాలు తెలిపాయి. సాంస్కృతిక అంశాల్లో పరస్పర సంబంధాల మెరుగునకు క్రీడలు దోహదపడతాయని పేర్కొన్నాయి.

జిల్లా అంధత్వ నివారణ సంస్థ సేవలు భేష్

సీతంపేట, న్యూస్‌టుడే : జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రజలకు మంచి సేవలు అందిస్తోందని డి.ఎం.హెచ్.ఒ. డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య శాలలో గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రామీణులు, విద్యార్థులు అన్ని వర్గాల ప్రజలకు నేత్ర సంబంధిత వ్యాధుల నివారణకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఎనలేని కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఛైర్మన్ డాక్టర్ మీనాక్షి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య శాలలో అత్యాధునిక పద్ధతుల్లో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్.ఎం.ఓ డాక్టర్ నవీన్ కుమార్, నేత్ర వైద్యశాల వైద్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డి.ఎం.హెచ్.ఒ. డాక్టర్ పి.జగదీశ్వరరావు

పల్లె పండగ వారోత్సవాలకు సన్నాహాలు

పెందుర్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 14 తేదీ నుంచి గ్రామ పంచాయతీల్లో ప్రారంభం కానున్న పల్లె పండగ వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం పెందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో కొల్లి వెంకటరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఇంజినీరింగ్ అధికారులు, కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు. 14 నుంచి మండలంలోని 15 పంచాయతీల పరిధిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులకు సంబంధించి ఎమ్మెల్యే చేతులు మీదుగా భూమిపూజ నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. ఆయా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీఆర్ డీఈఈ రమణమూర్తి, ఈవోపీఆర్డీ గుండు అప్పలరాజు, ఉపాధి హామీ ఏపీవో గోవింద్, గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న ఇన్‌ఛార్జి ఎంపీడీవో కొల్లి వెంకటరావు

రూ.40 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

దేశపాత్రునిపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెం, స్నేహపురి కాలనీలో జీవీఎంసీ నిధులు రూ.40లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లు, కాలువల పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో పూర్తిస్థాయిలో వసతులు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. త్వరలో రూ.కోటి విలువైన అభివృద్ధి పనులకు టెండర్లు పిలుస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, తదితరులు

రోడ్డు నిర్మాణానికి మోక్షమెప్పుడో..?


అభివృద్ధికి నోచుకోని గవరవానిపాలెం రహదారి

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలోని అనకాపల్లి - ఆనందపురం జాతీయ రహదారి నుంచి గవరవానిపాలెం మీదుగా ఎస్‌వీఎల్ లేఅవుట్‌లోని ఎన్టీఆర్ కాలనీ వరకు సుమారు 2 కిలోమీటర్ల బీటీ రహదారి నిర్మాణానికి 6 ఏళ్ల కిందట అప్పటి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి రూ.కోటి నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. ఆ తరువాత ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడంతో ప్రతిపాదన మరుగున పడింది. దీంతో పనులు ప్రారంభం కాలేదు. మట్టి రోడ్డు కావడంతో చినుకు పడితే బురదమయమై అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. అధికారులు చర్యలు తీసుకుని రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కార్మికులకు ఉపాధి కల్పించాలి : సిటూ

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : కర్మాగారంలోని పలు విభాగాల్లో రెండు నెలలుగా ఎలాంటి టెండర్లు పిలవకపోవడంతో సుమారు 600 ఒప్పంద కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని సిటూ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఉక్కునగరం స్మృత్యంజలి పార్కు వద్ద ఒప్పంద కార్మికులు నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. ఆయా కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకు ఉక్కు యాజమాన్యం ముందుకు రావాలని కోరారు. కర్మాగారాన్ని నిర్వీర్యం చేసేందుకే టెండర్లు పిలవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి... సమస్యను పరిష్కరించాలని కోరారు.



ధర్నా చేస్తున్న సిటూ సభ్యులు